ఆదివారం

ప్రజాశక్తి

జనవరి 23, 2005

కథా నిలయం
Entered

సామాజిక చిత్రాల శిల్పి

మృణాల్‌సేన్

హ్యాపీ బర్త్‌డే

(23-1-2005 నుంచి
29-1-2005 వరకు)

సాయిరూప
9సం॥, 23.1.1996
పాపారావు
నర్సన్నపేట-శ్రీకాకుళం

శివాని
4సం॥, 23.1.2001
సుకన్య-వెంకటేష్
రోటరీనగర్-ఖమ్మం

సాయి వినూత్న
4సం॥, 25.1.2001
సంధ్యారాణి-వినోద్‌శర్మ
అచ్చులాపూర్-ఆదిలాబాద్

సుదీక్ష
1సం॥, 26.1.2004
వందన-చంద్రశేఖర్
మెట్టుగూడా

అనిల్‌కుమార్(సన్ని)
3సం॥, 26.1.2002
జోత్స్నకుమారి-దేవకుమార్
తాడేపల్లి-గుంటూరు

అజ్జు
1సం॥, 28.1.2004
అహమ్మదున్నీసా-అహమ్మద్‌వలి
రాజమండ్రి-తూ॥గో॥

సరోజిని
29.1.2001
నాగమణి-మన్మధరావు
కుంచ-శ్రీకాకుళం

మౌనిక
4సం॥, 22.1.2001
రమణ-కృష్ణాగౌడ్
దేవరకొండ-నల్లగొండ

అఖిల్
2సం॥, జనవరి-2003
పుష్ప-ఖలీల్
మహబూబ్‌నగర్

ప్రత్యూష్
3సం॥, జనవరి-2002
సరస్వతి-జమలయ్య
హైదరాబాద్

సృజన
సుజాత-గణేష్
పలగర-విజయనగరం

రామ్‌చరణ్
రాణి-సురేష్
కామాటివీధి-నెల్లూరు

విజయ్‌కుమార్ రాజు
5సం॥, జనవరి-2000
లక్ష్మీదేవి-వెంకటసుబ్బయ్య
వేంపల్లె-కడప

శ్రీవినోద్‌కుమార్ రాజు
2సం॥, జనవరి-2003
లక్ష్మీదేవి-వెంకటసుబ్బయ్య
వేంపల్లె-కడప

అంకిత
1సం॥, జనవరి-2004
సునీత-శ్యాంసుందర్
పజ్జూరు-నల్లగొండ

ఆశిష్ నాయక్
1సం॥, జనవరి-
పద్మ-భిక్కునాయక్
కల్వకుర్తి-మ॥నగ

భార్గవి
చెన్నారెడ్డి
ఏన్కతల-రంగారెడ్డి

హేమలత
సరిత-గోపాల్
గడివేముల-కర్నూలు

అశ్వంత్
5సం॥, జనవరి-2000
లక్ష్మి-అల్లూరయ్య
కుషాయిగూడా-హైదరాబాద్

మనుష్య
1సం॥, జనవరి-2004
అమృత-మల్లేష్‌యాదవ్
నానక్‌నగర్-రంగారెడ్డి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

చైనా బజార్లు

9వ తేదీ సంచిక కవర్‌స్టోరీ "చైనాబజార్" గురించి బాగా రాశారు. మధ్యతరగతి ప్రజానీకం నాణ్యతను పక్కనబెట్టి ధరలకు ప్రాముఖ్యతనిస్తారు. వీరి బలహీనతల్ని తమకు అనుకూలంగా మార్చుకుని వ్యాపారం చేస్తున్నారు. వినియోగదారులకు ఆకర్షణీయంగా కనబడేమాటా వాస్తవమే. కొంత జాగురూకులై ఉండాలని నా అభిప్రాయం.

-బాసంగి లక్ష్మీకాంతమ్మ,
గాజువాక, విశాఖపట్టణం.

గాజుతెర

కవర్‌స్టోరీ చైనాబజార్ వ్యాసం మొదట్లో రచయత పేర్కొన్నట్లు మనది గ్లాస్‌కర్టెన్ ఎకానమీ అన్నది చాలా నిజం. మధ్యతరగతి వాళ్లకు అవే పెద్దషాపుల ఆశల్ని తీరుస్తున్నాయి.

-పి కామేశ్వరరావు, ఫ్లైవోవరు బ్రిడ్జిపక్కరోడ్, ఏలూరు.

సమీక్ష బాగుంది

పుస్తకపరిచయం శీర్షికలో 'చైతన్యప్రతీకలు ఈ తేనెటీగలు' వ్యాసం బాగుంది. టూరిస్ట్‌గైడ్‌లో 'విదురాక్షేత్రం' గురించి వివరణ బాగుంది. అందరి గురించి రాసినట్లుగానే అసంఘటిత కార్మికుల హక్కుల గురించి కూడా రచనలు వేస్తే బాగుండును.

-ఎం చంద్రశేఖర్, గుమాస్తాల సంఘం, సత్తుపల్లి,
ఖమ్మంజిల్లా

స్వయంకృషి

అనేక కష్టాలు ఎదురైనా తన కాళ్ళమీద నిలబడ్డ మాలోతు మంక్తి లాంటి స్త్రీ మూర్తులుండడం స్ఫూర్తిదాయకం. ఇలాంటి వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి.

-మేడూరి సత్యనారాయణ, ఖైరతాబాద్, హైదరాబాద్.

శీర్షికలన్నీ బాగుంటున్నాయి



ఈ వారం సంచికలోని అన్ని శీర్షికలూ ఒకదానికొకటి పోటీ పడుతున్నాయా అన్నంతగా బాగున్నాయి. ఈ వారం కవర్‌స్టోరీ చైనాబజార్ సంచికకే హైలైట్. దానిపై ముఖచిత్రం బాగుంది.

ఈ సంచికలోని రెండవ విశేషం "బాబూ...నన్నొదిలియ్..." పివి ఆత్మగౌరవంపై కార్టూన్. అన్ని శీర్షికలూ ఇలానే బాగుంటున్నాయి.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్

ఎందుకిలా మారావు...?

2వ తేదీ సంచికలోని "ఎందుకిలా మారావు సంజూ?" కథ చాలా బాగుంది. అది కేవలం కథ మాత్రమే కాదు. వేలాది ప్రశ్నల కొడవళ్ళ ఏకైక ప్రశ్న ఆ కథ. అందుకే ఆ కథ మమ్మల్ని ఆలోచింపజేసింది. ప్రపంచీకరణ బోడిగుండు మీద మొట్టికాయ వేసింది.

-ఆర్ లెనిన్‌బాబు, నిజామాబాద్

టూరిస్ట్‌గైడ్



మన పత్రికలో ప్రచురిస్తున్న టూరిస్ట్‌గైడ్ ద్వారా మన రాష్ట్రంలో మరుగునపడివున్న అనేక ప్రాంతాలను వెలికితీయాలని మనవి. వాటి విశిష్టతనూ తెలియజేయాలి. వాటి పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరి వదిలిపోయేలా ఆ వ్యాసాలుండాలి.

-యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం, తూ గో జిల్లా.

మనలో మాట

"చేతులు కాలాక...!"

మనలో మనం మాటవరసకు అనుకుంటాం చూడండి అట్లాంటివి కొన్ని... వాటి దుంపతెగ నిత్యసత్యాలుగా బల్లగుద్దుతాయి.

జీవితానుభవాలుగా వాసికెక్కుతాయి. జీవితసత్యాలుగా నిలబడిపోతాయి.

వాటినే మన పెద్దాళ్ళు మాట వరసకు వాడీవాడీ నానుడిగా, సామెతగా స్థిరపరిచేశారనుకోండి!

'చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అంటే ఇదే' అనే మాటవరస నానుడి, 'అడుసుతొక్కనేల-కాలు కడగనేల' అనే సామెత లాంటివాటికి ఎక్స్‌పెయిరీ డేట్ ఉండదు.

ఆ కాలానికే... ఈ కాలానికే... చెందుతుంది అనే కాలపరిమితి లేదు. ఈ దేశానికే... ఆ దేశానికే... అనే సరిహద్దుల మధ్యవరకే ఇడియమ్‌గా ఇమిడిపోయి వుండిపోదు. వారికైనా... వీరికైనా... ఎవరికైనా... వీపుమీద ఒక్కటేసినట్లు కనబడని వాత వేస్తుంది.

మన అనకాపల్లి అప్పారావయినా... అటలధ్వానీలైనా... అమెరికా అధ్యక్షుడు బుష్షయినా వారి డాడీ అయినా సరే... ఈ సామెతకు లెక్కలేదు.

మూడురంగులయినా... పసుపో, కాషాయమో, ఎర్రచారల-నీలి నక్షత్రాల జెండాలయినా... ఏ రంగు పార్టీలయినా ఈ నానుడికి మినహాయింపే లేదు.

అధికార, అనధికార, పక్ష, ప్రతిపక్ష, అతిపక్ష ఎవరైనాసరే...

కాకపోతే ఏంటి చెప్పండి...

శాంతి చర్చలు శాంతి చర్చలు అన్నాక... ఇలా చేయడం, అలా అనడం ఏంటి చెప్పండి?!

మసీదు పడగొట్టాక, దాని పరిణామం రుచి చూశాక... కంచి మఠాధిపతిని పట్టుకు వేలాడాలనుకోడం ఏంటి చెప్పండి?!!

ఇరాక్ ఎడారి ఇసుకలో తలదూర్చినప్పటి మొట్టికాయల వాపు ఇంకా మాననేలేదు... సునామీ బాధితుల సహాయాల మాటున గూఢచర్యం నెరపాలని చూడ్డం ఏంటి చెప్పండి?!!! అడుసెంత తొక్కినా కడుక్కునే నీళ్ళున్నాయిలే అనా...!

చేతులెన్నిసార్లు కాలినా పట్టుకోను ఆకులు కాప్పోతే ఆయింట్‌మెంటులున్నాయిలే అనా...!!

సరే... ఏం చేద్దాం... పెద్దమనసుతో చెప్పాం కదా...

వినడం వినకపోవడం వాళ్ళిష్టం.

ఈ సంచికలో . . .

ఔరా!	... 3
కార్టూన్ కదంబం...	... 4
కవర్ స్టోరీ	... 5
జీవనశైలి	... 10
బాలల కథ	... 11
బాలనేస్తాలు	... 12
ఇంతి సంగతి	... 16
కచేరి	... 17
ఆరోగ్యం	... 18
పుస్తక పరిచయం	... 20
న్యాయసలహాలు	... 24

ఇంకా...

"తిరగనిసారె"

కథ ... 8, 9

తలవంచిన ఎవరెస్ట్

రియల్ స్టోరీ ... 14, 15



పర్వత విడుదుల రాణి ముస్సోరీ

టూరిస్ట్‌గైడ్ ... 21

శాంతి స్థాపనకు కళారూపాలతో ప్రచారం

కళాసాహితి ... 22, 23

ఓరా!

కాటిలో బొగ్గులేరుకునే...!

బుష్ భస్మాసురుడు సర్వాంతర్యామి అవునో కాదో గానీ... "సర్వ్యాపి", "సర్వ్యాపారి" మాత్రం నిజంగా నిజం! పురుషులందు పుణ్యపురుషులు వేరన్నట్టు "సునామీలందు బుష్షునామీ వేరు" అనుకుంటే కొంచెం లేటెస్టుగా ఉంటుంది. లేకపోతే ఏంటి చెప్పండి! సునామీ ఉపద్రవం వచ్చి జనం అల్లల్లాడుతుంటే సానుభూతి కార్యక్రమాల్లో కూడా తన సామ్రాజ్యవిస్తరణా గూఢచర్యలు చేపట్టాడీ ఘనుండు. ఇరాక్‌లో తన యుద్ధపిపాసకై రోజుకి లక్షలాది డాలర్లు తగలేసే ఈ బుష్షు సునామీ బతుకుజీవుళ్ళకోసం చేయి విదల్చలేకపోయాడు. మళ్ళీ మరోసారి ప్రపంచమంతా 'ఛీ నీ బతుకుచెడ' అనేటప్పటికీ...దాన్న కర్ణుణ్ణనే ఫోజు పెట్టబోయాడు. ఆ ఫోజెనుక కూడా తన బుద్ధిపోనిచ్చుకున్నాడు కాదుమరి. సునామీ సహాయం పేరిట ఆయా దేశాల్లో బిఛాణా వేద్దామని గూఢచర్యాన్ని పొంచివుంచాడు. సునామీ అల వచ్చి వెనక్కి దాని దోవన అది పోయింది. ఈ అంతర్జాతీయ "బుష్షునామీ" లోపలికొచ్చిందో వెనక్కి ఎప్పుడెళ్ళుతుందో ఎవరికెరుక?! మరందుకే కొన్ని దేశాల ప్రజలు, "నువ్వూ వద్దు నీ సునామీ సానుభూతీ వద్దురా నాయనో" అనంటున్నారు.

"చూస్తా..."..."నేనూ చూస్తా"

"**పి**ల్లి పోరు, పిల్లి పోరు ఏ 'ఓటరు పిట్ట' తీరుస్తుందో" గానీ లాలూ ప్రసాద్‌కు, జార్జి ఫెర్నాండెజ్‌కు మధ్య దూషణ భూషణలు భీషణరూపం తీసుకున్నాయి. కామిక్ ప్రపంచం పొలిటిక్సుల్లో కొచ్చిందేవిటా అనుకుంటున్నారా?! అంత రసకందాయకంగానే ఉందిమరి! జార్జయ్య "రార్ ఆ లాలూని కటకటాలెనక్కు పంపేదాకా నేను ఛస్తే చావను" అన్నారు. వారలానగానే లాలూజీకూడా ఏం తక్కువతినకుండా "చావడానికి ఆయనకెప్పుడు టైం కుదుర్తో చెప్పమను...నేనూ జైలుకెళ్ళడానికి సిద్ధం" అన్నాట్ట! ఈయన "భూంరాంగ్" అంటే, ఆయన "భూంరాకెట్" అన్నట్టు!!

"డైవోర్స్"..."నో డైవోర్స్"!



ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో షావున్నా హగ్స్ అనే ఓ అమ్మణి తనను తిట్టి, కొట్టే మొగుడు వద్దుకాక వద్దు అంటూ సియాటెల్ కోర్టులో కేసు దాఖలు చేసింది. ఆ కోర్టు సుపీరియర్ జడ్జిగారు "ఈ రోజునుంచి మీ మ్యారేజ్ రద్దు అవుతుంది"అని జడ్జిమెంటిచ్చి "డైవోర్స్" అని మూడు సుత్తిదెబ్బలు కూడా కొట్టేశాడు. రాచి రంపాన పెట్టే ఆ రాయి, రంపంలాంటి మొగుడునుంచి 'విముక్తి మిల్‌గయా' అంటూ షావున్నా తన ఫ్రెండ్స్ అందరికీ టీపార్టీయో, మందు పార్టీయో కూడా ఇచ్చేసింది. ఆమె సంతోషం ఓ వారం కూడా నిలబడలేదు. 'భార్య గర్భవతి అయిఉండగా వారిద్దరిలో ఎవరు కోరినా వారి పెళ్లిని పెటాకులు చేయడానికి ఎవరికీ అధికారం లేదుకాక లేదని ఓ మెడికల్ రిపోర్టు అడ్డొచ్చింది. కోర్టు పాలసీయే కాదు, ఆ అమెరికా శ్వేతభవన రాజ్యాంగం ప్రకారం చూసినా ఈ తీర్పు ఇచ్చిన జడ్జీ ఉద్యోగానికే ఎసరు తెస్తుంది. దానితో సదరు అదే జడ్జి, "నో డైవర్స్" అని మళ్ళీ మూడు సుత్తి దెబ్బలు కొట్టాడు. ఆ షావుల్ తల్లి, "నన్ను చితకతన్నాడని నేను పెట్టిన కేసులో వాడు జైలులో ఉండగా ఈ గర్భం వచ్చింది. కావున నా కడుపులో కాయకు వాడు తండ్రి కాదు. అందుచేత నా విడాకులు ఇలా లాక్కోవడం సరైంది కాదు" అని అప్పీల్‌లో మొరపెట్టుకుంది. లాస్ ఏంజిల్స్‌లోని కుటుంబపర వ్యాజ్యాల న్యాయనిపుణులు ఏం చేద్దామా అని తెగ ఆలోచించేస్తున్నారు. లేకపోతే లాస్‌ఏంజిల్స్ 'లా' పరువు లాసయిపోద్ది మరి!

కార్టూన్ కదంబం


మీ అందరికీ ఇదే...
లక్ష ఎకరాల భూమి
కోట్ల ఎకరాల్లో మిగులు భూములు
రిపబ్లిక్ దినోత్సవం రోజున లక్ష ఎకరాల భూ పంపిణీ


వ్యాపారులైతే ఊరుకోరు మనం మనం ఒక్కటి...
ట్యాక్స్‌లు
చిదంబరం
వ్యాపారులకు నష్టం ఉండదు: కేంద్ర మంత్రి చిదంబరం
ఏప్రిల్ ఒకటి నుంచి వ్యాట్ అమలు


ప్రభుత్వం
టిఆర్ఎస్ మంత్రులు
నక్సల్స్

"సినిమా గారడి చేయడానికి ఉద్దేశించబడలేదు. నిజానికి సినిమా కొత్త ఆలోచనలు ఆవిష్కృతం కావడానికి సరికొత్త భావాలు వెల్లుబకడానికి, కళాత్మకమైన సంతోషం కలిగించడానికి నిర్దేశించబడింది. ఈ సినిమాలలో ప్రజా జీవితం ప్రతిబింబించాలి. వారి కష్టాలు, కడగండ్లు యథాతథంగా తెరకెక్కించాలి. శక్తివంతమైన ఈ సినిమా మాధ్యమాన్ని ప్రయోజనాత్మకంగా వినియోగించాలి"

- మృణాల్‌సేన్.

భారతీయ నవ్య సినిమా ఉద్యమ వైతాళికుల్లో, పంచరత్నాలనదగిన బెంగాలీ దిగ్దర్శకుల్లో ఒకరు మన మృణాల్‌సేన్ (మిగతా నలుగురు రిత్విక్‌ఘటక్, సత్యజిత్ రే, తపన్‌దా, బుద్ధదేవ్ దాస్‌గుప్త) 50 వసంతాల పాటు సమాంతర సినిమా రంగాన్ని తమ విభిన్న చలనచిత్రాలతో చకచ్చకితం చేసిన దర్శక మేధావి మృణాల్‌సేన్. అర శతాబ్దపు ఆయన సినీ సేవలకు గుర్తింపుగా ఇటీవలే కేంద్ర ప్రభుత్వం 2003 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక దాదాఫాల్కే అవార్డును ప్రకటించింది.

సామాజిక చిత్రాల శిల్పి మృణాల్‌సేన్

హెచ్. రమేష్‌బాబు

దాదాఫాల్కే అవార్డు పొందినవారిలో వీరు 35వ వారు. 1992లో భూపేన్‌దాకు ప్రకటించిన తరువాత వరుసగా 10 ఏళ్ళ పాటు ఈ అవార్డును వ్యాపార సినిమా ప్రముఖులకే బహూకరించారు. ఆలస్యంగానైనా ఈ అవార్డు మృణాల్‌దాకు ఇవ్వడం నవ్య సినిమా అభిమానులకు హర్షణీయమైంది. ఈ అవార్డు అందుకున్న 13వ దర్శకుడిగా, 8వ బెంగాలీయునిగా మృణాల్‌సేన్ రికార్డులకెక్కారు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతిచే ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు.

నేడు మనం పిలుచుకుంటున్న నవ్య, వాస్తవిక, సమాంతర సినిమాలు తొలుత ఆవిర్భవించినది బెంగాల్‌లోనే. రిత్విక్‌ఘటక్, సత్యజిత్ రేల పరంపరను తనదైన విలక్షణ ముద్రతో ముందుకు తీసుకువెళ్ళి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన దర్శకులు మృణాల్‌సేన్. ఆయన సినీ జీవితం ప్రారంభమైంది 1950 దశకంలోనే. రే, చిదానంద్ దాస్‌గుప్తాల ఫిలింసొసైటీలో చేరి దేశ దేశాల సినిమాలు చూసేవారు. చార్లీచాప్లిన్ సినిమాలంటే అభిమానం పెంచుకున్నారు. 1952లో దేశంలో జరిగిన తొలి ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమైన బైసికిల్ థీవ్స్(డిసికా), రాశోమన్, ఓపెన్‌సిటీ లాంటి సినిమాలు ఆయనను ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో రెడాల్ఫ్ అర్న్‌హీమ్ రాసిన "ఫిలిం" అనే పుస్తకం చదివి తన జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకొని సినీరంగ ప్రవేశం చేశారు.

1955లో "పథేర్‌పాంచాలి" విడుదలై దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ప్రేరణతో మృణాల్‌సేన్ కెమెరా వెనక్కివచ్చి దర్శకుడిగా తొలిసారి 1956లో "రాత్ బోరే" సినిమా తీశారు. అయితే వేసిన తొలిఅడుగే తడబడినట్లుగా ఈ సినిమా పరాజయంపొందింది. ఈ చేదు అనుభవాన్ని ఆయన ఏ సందర్భంలోనూ ప్రస్తావించలేదు. కాని ఆ వెంటనే మరో అవకాశం రాలేదు. ఆలస్యంగా వచ్చిన అవకాశంతో తీసిన సినిమా 'నీల్ ఆకాశేర్ నీచే' (1959). ఈ చిత్రం ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసలే కాదు లాభాలు కూడా తెచ్చిపెట్టింది. అప్పటి ప్రధాని నెహ్రూ ఈ చిత్రాన్ని చూసి "మృణాల్ నీవు దేశానికి గొప్ప సేవచేశావు. చూడు... నీ సినిమాలో ఇండియా-చైనా సంబంధాలను గొప్పగా చర్చించావు" అని అభినందించారు. అయితే ఆ తర్వాత చైనా యుద్ధ సమయంలో ఈ చిత్రాన్ని కొన్ని నెలల పాటు నిషేధించారు.

మృణాల్ తీసిన మూడవ సినిమా 'బైషే శ్రావణ్'(1960). అయితే ఆయన సినీ జీవితం మహత్తర మలుపు తిరిగింది 'భువన్‌శోమ్'తో. 1969లో వచ్చిన ఈ అత్యుత్తమ చిత్రం జాతీయ స్థాయిలో సేన్ పేరును మారుమ్రోగించింది. ఇది ఆయన తొలి హిందీ చిత్రం కావడం వలన బెంగాల్ బయటి ప్రాంతాల వారికి సేన్ ప్రతిభావ్యుత్పత్తులు నిరూపితమయ్యాయి. 'వనఫూల్'



మృగయా సినిమాలో మమతాశంకర్, మిథున్‌చక్రవర్తి

అనే వంగ రచయిత రాసిన చిన్న కథ ఈ సినిమాకు ఆధారం. బాక్సాఫీస్ సూత్రాలపై నిర్మితం కాని చిత్రమే అయినా ఇందులో భువన్ శోమ్‌గా నటించిన ఉత్పల్‌దత్‌కి జాతీయ ఉత్తమ నటునిగా, సేన్‌కు ఉత్తమ దర్శకునితోపాటు ఈ సినిమాకు ఏకంగా జాతీయ ఉత్తమ చిత్రం అవార్డు రావడం నాడు గొప్ప సంగతి. ఈ చిత్రం తరువాత చిల్డ్రన్స్ ఫిలింసొసైటీ వారికోసం హిందీ, బెంగాలీ భాషల్లో సేన్ 'ఇచ్ఛాపూరణి'(1970) నిర్మించారు. 1971లో 'ఏక్ అధూరి కహానీ' తీశారు.

విశ్వఖ్యాతి గాంచిన సత్యజిత్ రే 'అపూ' ట్రయాలజీకి భిన్నంగా ఆధునిక సమాజంలో యువతరాన్ని కుదిపేస్తున్న సమస్యలతో సోషియో పొలిటికల్ టచ్‌తో మృణాల్‌సేన్ 'కలకత్తా' ట్రయాలజీని తీశారు. ఈ ట్రయాలజీలో తీసిన మొదటి సినిమా 'ఇంటర్వ్యూ'(1971). ఇది అప్పటిదాకా వచ్చిన న్యూ సినిమాల ఒరవడిలోని పద్ధతులను కాదని కొత్త శైలిని ఆవిష్కరించింది. కలకత్తాలో "ఇంటర్వ్యూ" చిత్రం మొదటి షో చూసి బయటికి వస్తూ కొందరు 'మృణాల్‌సేన్ జిందాబాద్', 'కమ్యూనిజం జిందాబాద్' అనే నినాదాలు చేశారు. ట్రయాలజీలోని 2వ చిత్రం 'కలకత్తా-71' (1972). సమాజం పేదరికం, దారిద్ర్యం, అవినీతి, ఆకలి, దోపిడీల మధ్య నలుగుతున్న వైనాన్ని ఈ చిత్రం ఆవిష్కరించింది. ఈ క్రమంలోని మూడవ చిత్రం 'పథాతిక్'(గెరిల్లా యోధుడు) 1973లో వచ్చింది. ఈ మూడు చిత్రాలు ప్రధానంగా నాడు కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన విభజన, ఉవ్వెత్తున ఎగిసిన నక్సలైటు ఉద్యమాల ప్రస్తావనతో రూపొందినవి. నక్సలైటు ఉద్యమ పోకడలను విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా చూపిన చిత్రం 'పథాతిక్'. ఈ మూడు చిత్రాలు నాటి రాజకీయ పరిణామాల పట్ల సేన్ చేసిన ప్రకటనలుగా విమర్శకులు చెప్పుకున్నారు. మృణాల్‌సేన్ తీసిన మరో అద్భుత దృశ్యకావ్యం 'కోరస్'(1974). ఇది జాతీయ స్థాయిలో స్వర్ణ కమలం అందుకున్న చిత్రం. స్వాతంత్ర్యం వచ్చి పాతి కేళ్ళు గడచినా దేశంలోని విద్యావంతులకు ఉపాధి, లేక పేదరికం, నిరుద్యోగ సమస్యల వికృత రూపాన్ని కళ్లకు కట్టిస్తారు సేన్. చివరికి యువతరం పాలకవర్గాలపై తిరగబడుతూ 'మీ పాలకుల మోసాలు మేము గుర్తించాం, మీ కుతంత్రాలు ఇక చెల్లవు' అంటూ అంతా కలిసి ఒకరికొకరు గళం కలిపి చేసిన సమూహ గానం(కోరస్) అది. అధికారగణం ఒక్కసారిగా ఉలిక్కిపడి 'శాంతి, అహింస' అని వారు ఉపదేశాలు చేసినా లెక్కచేయని సమూహ గానం ముందుకు సాగి వెళుతూనే ఉంటుంది. 'ధన స్వామ్యం చేసే దోపిడీ-తత్ఫలితంగా ఏర్పడే పరిణామాలు, ఈనాటి దారిద్ర్యానికి, అశాంతికి కారణాలని, కళల ద్వారా ప్రజా చైతన్యానికి కృషి చేయడమే మనందరి ధ్యేయం కావాలని సేన్ అభిప్రాయపడతారు. అందుకే ఆయన చిత్రాలన్నీ సామాన్య జనం 'అలజడి మా జీవితం - ఆందోళన మా ఊపిరి- తిరుగుబాటు మా వేదాంతం' అన్న ధోరణిలో కోరస్ పాడుతుంటారు. కోరస్‌లో ఆయన వాడిన హరీంద్రనాద్ ఛటోపాధ్యాయ గీతం ఇటలీ, రష్యాలలో చాలా మందికి అభిమానగీతమైంది. కానీ ఇటలీలో కోరస్ చూసిన కొందరు మాత్రం 'ఇది సంఘవ్యతిరేక చిత్రమని' కూడా వాఖ్యానించారు.

"నీలే ఆకాశేర్ నీచే" సినిమాలో దృశ్యం

మృణాల్‌సేన్ తీసిన మొదటి రంగుల చిత్రం 'మృగయా'(1976). ఒరియా ఆదివాసీ జీవనాన్ని ప్రతిబింబించే ఈ చిత్రంలోని కథాంశం 1930 నాటిది. అడవిలో మనుషుల్ని చంపుకుతింటున్న మృగాన్ని చంపితే బహుమతి ఇచ్చి ప్రశంసించిన వారే, మానవ సమాజంలో మనుషుల్ని పీక్కుతినే 'మానవ మృగాన్ని' చంపినందుకు అదే యువకునికి మరణశిక్ష విధించడాన్ని దర్శకుడిగా సేన్ ప్రశ్నిస్తారు. ఆయన ఆలోచనల్లోంచి సరికొత్తగా తయారైన సినిమా ఇది. ఇందులో నటించి తొలిసారిగా సినిమాకు పరిచయమైన మిథున్ చక్రవర్తి ఏకంగా జాతీయ ఉత్తమ నటుడు అవార్డు అందుకుని సంచలనం సృష్టించాడు. ఈ చిత్రం ఆ యేటి స్వర్ణ కమలం కూడా అందుకుంది.

"మృగయా" రూపొందిన కాలంలోనే మృణాల్‌దా వీరతెలంగాణ సాయుధ పోరాట గాథని తెరకెక్కించే ప్రయత్నాలు చేశారు. ఇందుకు సంబంధించిన సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేశారు. కానీ ఆయన దర్శకత్వంలో తొలిసారిగా ప్రేమ్‌చంద్ 'కఫన్' ఆధారంగా "ఒక ఊరి కథ"(1977) తెలుగు సినిమా తీశారు. ఈ సినిమా అనుభవాలు ఆయన మాటల్లోనే- 'మాతృభాష కాని భాషలో సినిమా తీస్తే 'అకిరా కురుసోవా'కి సైతం ఇబ్బందులు ఎదురైనాయి. నేను హిందీ, ఒరియా,

మృణాల్‌దా వర్సెస్ సత్యజిత్ రే

సత్యజిత్‌రేకు మృణాల్‌కు మధ్యన చాలా సారూప్యత ఉంటుంది. 'మేమిద్దరం మంచి స్నేహితులం. మంచి విమర్శకులం కూడా. ఒకరి పనిని ఒకరం కచ్చితంగా నిష్పాక్షికంగా విమర్శించుకునేవాళ్ళం. ఇద్దరి భావజాలాన్ని పంచుకునేవాళ్ళం. అలాగని ఒకే దృక్పథం ఉన్నవాళ్ళమనుకోము' అనంటారు సేన్. 1965లో సేన్ తీసిన 'ఆకాశ్ కుసుమ్'లో ఉన్నత వర్గాల వారిపై పేరడీ చేశారు. దానికి బెంగాలీ ఉత్తమ చిత్రం అవార్డు వచ్చింది. కాని ఈ చిత్రంపై రే స్టేట్స్‌మెన్'లో చేసిన విమర్శ పెద్ద సంచలనమే రేపింది. ఇద్దరి నడుమ తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు నడిచాయి. సుమారు 45 రోజులు స్టేట్స్‌మెన్ పత్రికలో ఈ చర్చలు జరిగాయి. ఈ వాదనల ఫలితంగా ఆ ఇద్దరు మహాదర్శకుల మధ్య స్నేహబంధాలు చెడ్డాయి. ఆ తరువాతి కాలంలో ఏ ఫంక్షన్‌లోనైనా కనిపించినా 'హలో' అని పలకరించుకోవడం తప్ప వారిద్దరి మధ్య మరోమాట ఉండేది కాదు.

బెంగాలీ, తెలుగు భాషల్లో సినిమాలు తీశాను. తెలుగులో ఒక ఊరి కథ తీస్తున్నప్పుడు నిర్మాతలు హైదరాబాద్‌కు చెందిన ఓ రచయిత చేత స్క్రిప్టు రాయించారు. ఏ ప్రాంతంలో నేను సినిమా తీయబోతున్నానో ఆ ప్రాంతం బాగా తెలిసిన వ్యక్తిని నాకు పరిచయం చేయమని కామ్రేడ్ సుందరయ్య గారిని అడిగాను. ఆయన కృష్ణమూర్తిని పరిచయం చేశారు. కృష్ణమూర్తి జీవిత పాఠశాలలో సంఘర్షణ ఒడిలో మార్క్సిజం అక్షరాలు నేర్చుకున్న నేటివ్ జీనియస్. పాత్ర స్వభావం-సన్నివేశం-రచయిత రాసిన డైలాగులు ఆయనతో కూర్చున్నప్పుడు ప్రస్తావించే వాడిని. గుడిసెలలో బతికే పనిదొంగలు మాట్లాడే మాటలు చెప్పేవారు. ఆ భాషనే మేము మా స్క్రిప్టులో దిద్దుకునేవారం". ఈ సినిమా తీస్తున్న సమయంలో పేదకుటుంబ జీవన విధానం గురించి తెలుసుకునేందుకు ఇబ్రహీంపట్నం, బీదేడు గ్రామాలలో పేదవారి మధ్యన గడిపారాయన. షూటింగ్ కోసం వారు వాడే గిన్నె, ముంత లాంటి వస్తువులు తీసుకొని వారికి కొత్తవి కొనిచ్చి షూటింగ్‌కు వాడుకున్నారు. అలా తన చిత్రాల్లో వాస్తవికతను ప్రతిబింబింప చేస్తారాయన. ఈ సినిమా రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డుతో పాటు కేంద్ర ప్రభుత్వ అవార్డు కూడా అందుకుంది. అనంతరం బి.నరసింగరావు 'మా భూమి' తీస్తూ మృణాల్‌దాని డైరెక్ట్ చేయమన్నారు. కానీ తాను బెంగాలీ సినిమా తీస్తున్నందున గౌతమ్‌ఘోష్‌ని ఆ సినిమాకు దర్శకునిగా తీసుకొమ్మని సిఫారసు చేశారు.

ఈ నేపథ్యంలో మృణాల్‌సేన్ తీసిన మునశ్చ, అభిషేక్, ప్రతినిధి(బెంగాలీ), మతిర మనిష(ఒరియా) పరశురాం, ఏక్‌దిన్ ప్రతిదిన్, అకాలేర్ సంధానే, చాల్‌చిత్ర(బెంగాలీ) ఖరీజ్, ఖాందాహార్, జనిసిస్, ఏక్‌దిన్ అచానక్(హిందీ) అంత్‌వేస్టీ, మహాపృథ్వీ, అంతరేన్(బెంగాలీ) అండ్ ది షో గోస్ ఆన్, స్వదేశ్, అమర్ భువన్ వంటి చిత్రాలన్నీ ఆయన కీర్తిని అంతర్జాతీయం చేసినవే. ఇంకా ఫిలిమ్స్ డివిజన్ వారికి మూవీంగ్ పరస్పెక్టివ్ డాక్యుమెంటరీ, టీవీ సీరియల్స్,పలు టెలిఫిలిమ్ లు తీశారాయన. మృణాల్ దా సినిమాలన్నీ సమ కాలీనమైనవి. మారుతున్న కాలమాన పరిస్థితులకు తన ఆలోచనలకు అద్దం పడుతూ వాస్తవికతతో పాటు నర్మగర్భంగా నేటి సమాజంలోని అక్రమాల ను బట్టబయలు చేసేవిగా, తిరుగుబాటు ప్రకటిం చేవిగా ఉంటాయి. మధ్య తరగతి జీవితాలకు తెరరూపం కల్పించారు. వీటన్నింటికీ గల ప్రధాన కారణం సేన్ ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబంలోంచి వచ్చిన వ్యక్తి కావడమే. ఆయన 1923 మే 14న నేటి బాంగ్లాదేశ్‌లోని ఫరీద్‌పూర్ జిల్లాలో పుట్టారు. విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. ఫిజిక్స్‌లో డిగ్రీ పొందారు. రాజకీయ చర్చలు, సాహిత్య సమ్మేళనాల మధ్య తనను తాను రూపొందించుకున్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా, బడిపంతులుగా జీవితం ప్రారంభించారు. సినిమా సామాజిక చైతన్యానికి దోహద పడాలన్న దృఢమైన భావనతో చిత్రసీమలోకి ప్రవేశించారు. ఆయన తొలుత సౌండ్ రికార్డింగ్ శాఖలోనూ, కొన్నాళ్ళు జర్నలిస్టుగానూ పనిచేశారు. చాప్లిన్‌పై అభిమానంతో బెంగాలీలో ఆయన జీవిత చరిత్రను రాశారు. ఒక జెక్ నవలను అనువాదం చేశారు.

మృణాల్ సేన్ సినీరంగ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ, 1980లో పద్మభూషణ్ బిరుదులనిచ్చింది. ఆయన సినీ జీవిత రజతోత్సవం సందర్భంగా ఇఫీలో రెట్రాస్పెక్టివ్ నిర్వహించారు. 1995లో యునెస్కో సినిమా-100 ఉత్సవాల కమిటీలో సభ్యత్వం ఇచ్చారు. 1998లో ఇటలీ నేపెల్స్ చిత్రోత్సవంలో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, అమెరికన్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్ సన్మానం, బెంగాల్ ప్రభుత్వ రే మెమోరియల్ అవార్డు, రష్యా ప్రభుత్వ ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ అవార్డు (2001), పూణే చిత్రోత్సవ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు (2002), పలు యూనివర్సిటీల గౌరవ డాక్టరేట్లు ఆయనను వరించాయి. 1978లో చైనా, 1979లో జపాన్ దేశాలు ఆహ్వానించి సన్మానించాయి. ఇంకా ఆయన తీసిన చాలా చిత్రాలు జాతీయ అవార్డులను అందుకున్నాయి. ఇండియన్ పనోరమలో ఆయన చిత్రాలన్నీ ప్రదర్శితమయ్యాయి. వాస్తవానికి ఈ ఫాల్కే అవార్డు కూడా సీనియారిటీ, ప్రతిభలను ప్రాతిపదికగా తీసుకుంటే సేన్‌కు మూడేళ్ళ క్రితమే రావలసింది. ఆలస్యమే అయినా ఈ ఎంపిక సినిమా అభిమానులకు హర్షణీయం.

ఫాల్కే అవార్డు విజేతలు(1969-2003)

భారతీయ సినీ పితామహుడు దాదాఫాల్కే శత జయంతి సందర్భంగా 1965లో కేంద్ర ప్రభుత్వం ఆయన పేర ఒక అవార్డును ప్రవేశపెట్టింది అత్యంత ప్రతిభావంతులైన సీనియర్ సినీ మేధావులకు బహూకరిస్తారు. ఈ అవార్డు క్రింద మొదట 11వేలుగా ఉన్న నగదు, 1973లో 20 వేలు, 1977లో 40 వేలు, 1984లో లక్షగా పెంచారు. ప్రస్తుతం ఈ అవార్డు కింద రెండు లక్షల నగదుతో పాటు బంగారు పతకం, శాలువా, ప్రశంసాపత్రంతో సన్మానిస్తారు. 1969 నుండి మృణాల్‌దా వరకు మొత్తం అవార్డు గ్రహీతలు 35మంది.వీరిలో బి.ఎన్.రెడ్డి(1974), ఎల్.వి.ప్రసాద్(1982), బి.నాగిరెడ్డి (1996), అక్కినేని నాగేశ్వర్‌రావు(1990) తెలుగు వారు. మిగతా వారు వరుసగా-

దాదాసాహెబ్ ఫాల్కే.

దేవికారాణి(1969), బి.ఎన్ సర్కార్(1970), పృథ్వీరాజ్ కపూర్(1971), పంకజ్‌మల్లిక్(1972), రూబీ మేయర్ సులోచన(1973), ధీరేన్ గంగూలి(1975), కానన్‌దేవి(1976), నితిన్‌బోస్(1977), ఆర్.సి.బోరాలు(1978), సోహ్రాబ్ మోడీ(1979), పైడి జయరాజ్(1980), నౌషాద్(1981), దుర్గాకోటే(1983), సత్యజిత్ రే(1984), వి.శాంతారాం(1985), రాజ్‌కపూర్(1987), అశోక్‌కుమార్(1988), లతామంగేష్కర్(1989), బాలాజీ పెండార్కర్(1991), భూపేన్ హజారికా(1992), మజ్రూహ్ సుల్తాన్‌పురి(1993), దిలీప్‌కుమార్(1994), రాజ్‌కుమార్(1995), శివాజీ గణేశన్(1996), కవి ప్రదీప్(1997), బి.ఆర్.చోప్రా(1998), హృషీకేష్ ముఖర్జీ(1999), ఆశాభోంస్లే(2000), ఎస్.చోప్రా(2001), దేవానంద్(2002), మృణాల్‌సేన్(2003).


కలకత్తా-71, సినిమాలో దృశ్యం

"తిరగని సారె"

-డి కల్పన

"జరరోడ్డు మీద దాంక పొయ్యొస్త" అన్కుంట బయటకొచ్చిన బిచ్చమయ్య, ఒక్కసారిగా "అరెరె... ఏందిరా... ఇది, లెవ్వు, లెవ్వు... సారె జరిగిపోతది" అని, జరకోపంతోని మూడేండ్ల మనవాడైన శీనును పక్కకు జరిపిండు.

అంతల్నే... ఈ లొల్లికి ఏమయ్యిందో అని లచ్చవ్వ, ఆమె ఎన్కనే పెద్దకోడలు సుజాత బయటికి ఉర్కొచ్చిండ్రు.

ఎన్నడు లేంది, బిచ్చమయ్యకు ఇంత కోపం రావడం చూసి "ఏమయ్యింది...?" అని మెల్లగ అడిగింది లచ్చవ్వ.

"..."

బిచ్చమయ్య... లచ్చవ్వను ఒక్కసారి చూసి సప్పుడు చెయ్యక, బయటికెళ్ళిపోయిండు.

మళ్ళీ లచ్చవ్వనే, అన్నే ఉన్న చిన్న కొడుకు వెంకటేశును "ఏమయిందిరా...? మీ అయ్య ఎన్నడులేంది, అంత కోపంగ అరిచిండు?" అన్నది.

"అ... ఏం లేదే..... శీనుగాడు సారె మీద కూసుంటే... మన పక్కింటి అంజిగాడు దానిని గుండ్రంగ తిప్పిండు. అదిచూసి, నైన సారె ఇరిగి పోతదని లొల్లి పెట్టిండు."

"అయినా... నాకు తెల్వకడుగుత, ఇంకా... ఎందుకే అది, పనిలేదు, పాట లేదు, ఏమిటికి అక్కెరొస్తది, తీసి ఇరిసి పొయ్యిల పెట్టక" అన్నడు.

"నోర్మూయ్యిరా.... గాడిదికొడక..., నీకు అట్లంటందుకు నోరెట్లొచ్చిందరా... అది మన ఇంటి దేవతరా... మనకు కడుపునిండ బువ్వపెట్టిన తల్లిరా... ఏదో ఇప్పుడు కాలం లేక, పని దొరకనందుకు, దాన్ని తీసి పొయ్యిల పెట్టమంటావురా..., పొయ్యిల...

"అట్లయితే... ముసలోళ్ళయినంక,

నన్ను, మీ అయ్యను గూడ పనికిరారని చావుమంట ట్టున్నవురా... నువ్వు" అన్నది లచ్చవ్వ ఆవేశంగ...

"నేనేదో... ఉట్టిగనే అంటే, అంత కోపం జేస్తవేందే.. అదీ... మీరు ఒకటేనానే.. నేనొకటంటే నువ్వొకటంటవు..." అన్నడు.

"అవునురా మళ్ళ... అదీ, మేము ఒకటేరా... ఒకటే... దాంతోనే మేము... మాతోనే అది. అది గిన లేకుంటే... మీరేన్నుంచుంటుండే... మీరెట్ల బతుకుతుండే, గింత పెద్దగ ఎట్లయితుండే... తల్లి రొమ్ము పాలు తాగి రొమ్మునే కోసిండంట నీ అసుంటోడు. అయినా...నువ్వేకాదు. ఇయ్యాల రేపు లోకమే ఇట్లున్నది.. నిన్నని ఏం లాభం" అని అంటున్నపుడు వస్తున్న దు:ఖంతో గొంతు జీరబొయ్యింది లచ్చవ్వకు.

"ఓయమ్మో తల్లీ! నీకు దండం పెడతనే తల్లీ... దండం పెడతా.. గింత పెద్ద క్లాసు పీకుతవనుకోలేదే.. అనుకోలేదు... ఇంకనయం, నీకు గిన సదువొస్తే.. కష్టమే వుండు. మమ్మల్ని రోజు గిట్ల చెప్పి చెప్పి సంపుదువు" అని నవ్వుకుంట "నేను గూడ రోడ్డుమీద దాంక పొయ్యొస్త" అన్కుంట పొయ్యిండు.

లచ్చవ్వ పెద్దకోడలు సుజాత మొఖాలల్ల గూడ వెంకటేశు అన్న మాటలకు నవ్వు వచ్చింది. అంతల్నే పెద్దకోడలు సుజాత "చీకటయితుంది అత్తమ్మ. బియ్యం ఎన్ని కడగాలే...?" అన్నది.

లచ్చవ్వ తేరుకొని కండ్లనీళ్ళు కొంగుతోని తుడుసుకుంట "ఆ.. పొద్దటన్నం ఎంతుందో సూడు... సూశి పొయ్యి... అయినా నీకు తెల్వదానే.." అని, బాబాయ్ పోతా... బాబాయ్ పోతా... అని ఏడుస్తున్న శీనును ఎత్కొని మీద కూసోబెట్టుకుంది.

వరండాల మొగురానికి ఆనుకుని కూసుని వున్న లచ్చవ్వ చూపులు మాత్రం ఎదురుగా వున్న సారె మీద కుండలు కాల్చే వాము మీదనే వున్నయి... మనసు మాత్రం సారె లాగ గుండ్రంగ పాతరోజుల జ్ఞాపకాల చుట్టూ తిరుగుతుంది.

* * *

బిచ్చమయ్య తల్లిదండ్రులకు లేక లేక కల్గిన సంతానం. మళ్ళీ ఈన ఎన్క అన్నదమ్ములు గాని, అక్క చెల్లెండ్లుగాని ఎవ్వరు లేరు. చిన్నప్పట్నుంచే కులవృత్తిలో ఆరితేరిన నిపుణుడు. కొడుకు చూపిస్తున్న ఉత్సాహం కాదనలేక, బిచ్చమయ్యకు ఏడేండ్ల నుంచే కుండలు చేసుడు నేర్పిండు తండ్రి.

తండ్రి నేర్పిన దానికి తోడుగ, పదిహేనేండ్ల వరకే తనే సొంతంగ కొన్ని కొత్త కొత్త ప్రయోగాలు చేసి, కొత్త కొత్త వస్తువులు చిమ్నీలు, దేవుండ్ల బొమ్మలు, పూలకుండీలు, తులసి కోటలు... ఇలా రకరకాలుగా చేసి పక్కూర్ల సంతలు, జాతరలు జరిగితే తీస్కపోయి అమ్మేటోడు.

దీనికితోడు... ఓపారి... గవర్నమెంటు తరపున పక్క రాష్ట్రంల కొత్త డిజైన్ కుండలు తయారుచేసే ట్రెయినింగ్ ఇస్తురంటే... బిచ్చమయ్య పనితనము తెలిసిన ఊరి పెద్దదొర, బిచ్చమయ్యను ఆళ్ళ నైన వద్దన్నాగూడ, మొత్తం ఖర్చు గవర్నమెంటోళ్ళే పెట్టుకుంటరని పంపిండు.

ఇగ అప్పట్నుంచి ఆ ఊర్లనే ఉన్న పది పన్నెండు కుమ్మరోళ్ళ కుటుంబాలల్ల బిచ్చమయ్య పేరెల్లిండు. ఎవరన్న పట్నం నుంచి వచ్చినోళ్ళు, సదువుకున్నోళ్ళు, దోస్తులు వచ్చి కొత్త వస్తువు డిజైన్ చెప్పి గిట్ల కావాల్నంటే, అట్లనే ఆ వస్తువు బిచ్చమయ్య చేస్తుండే.

అట్ల బిచ్చమయ్యకు ఊర్లె మామూలు రాతం కుండల గిరాకే గాక, బయట పట్నం గిరాకి కూడ మస్తుంటుండే... చేతికింద ఇద్దరు ముగ్గురు పోరగాళ్ళకు కూడా బెత్కొని చేస్తుండే.

ఇగ, బిచ్చమయ్యకు పద్దేనిమిదేండ్ల పడంగనే, తల్లిదండ్రులు కొడుకుకు లచ్చవ్వనిచ్చి పెండ్లి చేసిండ్రు.

ఊర్లల్ల గూడ పనులు లేక అందరు పట్నాలల్లకు పోయి, రాతాలు మొత్తం లేకుండ పోయినయి. గౌన్లొల్లకు కూడ గిరాకీ లేక, ఆళ్ళు కుండలు, ముంతలు తీస్కపోతలే. పెంకటిండ్లు గూడ ఎవ్వరు కట్టుకోక ఆ పెంకల గిరాకీ లేదు. కరెంటు ఫ్రిజ్‌లొచ్చి, నీళ్ళు తాగే కుండల గిరాకీ పొయ్యింది.

తొమ్మిదేండ్లల్ల ముగ్గురుకొడుకులు పుట్టిండ్రు బిచ్చమయ్యకు.

గిరాకీలు బాగనే వుండి, జర చేతుల పైసలు కనపడుతున్నయని, తండ్రి కట్టిన రెండు అర్రల ఇల్లు తీసేసి, నాల్గు అర్రలు, పెద్ద వరండా, వండె ఇల్లు గివన్ని ఉండేటట్లు పెద్ద ఇల్లు కట్టిండు. తనే పెంకలు తయారు చేసిండు. ఇది చూసి బిచ్చమయ్య తల్లి, తండ్రీ మస్తు సంబూరపడ్డరు.

పిల్లల్ని ముగ్గుర్ని ఊర్ల ఉన్న సర్కారు బడిల చదువుకుంటందుకు పంపిండు. బడి అయిపోయినంక బిచ్చమయ్య ముగ్గురు కొడుకులకు కులవృత్తి రావాలని కుండలు చేసుడు గిన నేర్పుతుండే.

పెద్దపిలగాడు ఐదుదాంక, నడిపోడు ఏడుదాంక చదివి ఇగ చదవమని తండ్రికి తోడుగ వృత్తి పని చేస్తుండే. చిన్నోడు వెంకటేశు మాత్రం పన్నెండు దాంక చదివిండు.

ఈ కాలంలనే తల్లి తండ్రి మనుమని పెండ్లిసూస్తం అంటే... బిచ్చమయ్య పెద్దకొడుకుకు, దూరం సుట్టం అయిన సుజాతనిచ్చి పెండ్లి చేసిండు.

ఆ పెండ్లి కాంగనే యాడాదిలనే బిచ్చమయ్య తల్లీ తండ్రీ కాలం చేసిండ్రు.

బిచ్చమయ్య పెద్దకొడుకు పెండ్లయిన ఐదేండ్లకు శీనుగాడు పుట్టిండు. ఇప్పుడు శ్రీనుకి మూడేళ్ళు. ఏమయిందో ఏమో... ఈ ఏడెనిమిదేండ్ల నుంచే కుమ్మరోళ్ళ గిరాకులు మొత్తం దెబ్బతిన్నయి.

కరెంటుతోని నడిచే కుండలొచ్చినయి, ఈ కుండలు కొనేటోడే కరువైండ్రు. రబ్బరు బొమ్మలు, బొచ్చు బొమ్మలొచ్చి మట్టిబొమ్మలు తీస్కుంటోళ్ళే లేకుండ బొయ్యిండ్రు.

కుమ్మరి పని మొత్తం బందయ్యింది. ఈ కరువుల్నే నడిపోని పెండ్లి చేసిండు బిచ్చమయ్య. నడిపోడు పెండ్లికి ముందునుంచే కుమ్మరిపని లేదని, లారీ నడుపు నేర్చుకొని, గిప్పుడు లారీమీద పోతుండు. అని పెండ్లం నీళ్ళుపోసుకుందిప్పుడు, కంటందుకు అమ్మగారింటికి పొయ్యింది.

రెండేండ్ల కిందదాంక గూడ గట్లనో... గిట్లనో.. గీపన్లనే వున్న పెద్దోడు గూడ, గిప్పుడు ఉప్పరి పనికి పోతుండు. ఇగ ఇంటోళ్ళే పనిలేక బయటికి పోంగనే... చేతికింద పిల్లలు గూడ పనిలేదని, వేరేపనికి పొయ్యిండ్రు.

ఇగ అందర్ల చిన్నోడు అయిన వెంకటేశు, పట్టుబట్టి పన్నెండు దాంక చదివి... ఏ పని చేయక రోడ్డు మీద తిరుగుతుండు. ఇంట్ల ఆడోళ్ళు గూడ ఏపన్లేక కూలిపనికి పోతున్నరు.

చిన్నతనం నుంచి కుండలు చేసుడు తప్పితే... ఏ పని రాని, చేద్దామన్న ముసలితనం మీదపడి, చేతగాక బిచ్చమయ్య గట్లనే.. అదుపో, దదుపో... కుండలు జేస్తుండు.

అయినా... ఊర్లల్ల గూడ పనులు లేక అందరు పట్నాలల్లకు పోయి, రాతాలు మొత్తం లేకుండ పోయినయి. గౌన్లొల్లకు కూడ గిరాకీ లేక, ఆళ్ళు కుండలు, ముంతలు తీస్కపోతలే. పెంకటిండ్లు గూడ ఎవ్వరు కట్టుకోక ఆ పెంకల గిరాకీ లేదు. కరెంటు ఫ్రిజ్‌లొచ్చి, నీళ్ళు తాగే కుండల గిరాకీ పొయ్యింది.

"ఇగ ఉన్నదల్లా...ఎప్పుడన్న ఎవరన్న చస్తే... లేకపోతే పెండ్లిల్లు అయితే... ఇగ కొత్త సమత్సరమొస్తే ఉగాదికి, ఊర్ల బోనాలకు, కుండలు అవసరమొస్తున్నయి. అదిగూడ, పక్కూర్ల కరెంటు సారె మీద కుండలు చేస్తుండ్రంట. అవే మంచిగున్నయి, దబ్బున అయితున్నయి అని, ఆ... గిరాకులు గూడ ఆళ్ళకే బోతున్నయి. మా అసుంటోళ్ళ దగ్గరికి ఎవరొస్తలేరు" లచ్చవ్వ మదిలో ఆలోచనల సారె గిరగిరా తిరుగుతూనే ఉంది.

"పోనీ... ఇదివరలెక్క జాతర్లకు, సంతలకు పోయినగూడ కుండలెవ్వడు కొంటలే. ఇండ్లు కట్టుకుంటోళ్ళు. ఇండ్లల్లనే ఇటుకెలతోటి, తులసికోటలు, చెట్లకు పాదులు కట్టిపిచ్చుకుంటుండ్రు. ఇగ ఏం... గిరాకులొస్తయి. ఎట్ల బతుకుతావో''నని కిందమీదలౌతోంది లచ్చవ్వ.

అందుకే... గి ?ఫికర్‌తోని యాభయ్యేండ్లకే ఎనభై ఏండ్ల ముసలోని లాగయ్యిండు బిచ్చమయ్య. సారెనేమో.. పిల్లలు ఆడుకుంటందుకు ఆటబొమ్మ అయ్యింది. వాము కింద కోళ్ళు కమ్ముతుండ్రు...

ఇదంతా గతం గుర్తుకొచ్చి బాధపడ్తున్న లచ్చవ్వ కండ్ల నీళ్ళు, చెయ్యిమీద పడంగనే... పిలగాడు శీను "అమ్మ నైనమ్మ ఏచతుంది" అని లొల్లిపెట్టి "ఏచకు నైనమ్మ ఏచకు" అని చిట్టి చేతులతో లచ్చవ్వ కండ్లనీళ్ళు తుడుస్తుండు.

*

సునామీకి కారణం...

డా॥ ముదిగంటి సుజాతా రెడ్డి

సూపర్ మార్కెట్‌లో నెలక్కావల్సిన పప్పులు బియ్యం సబ్బులు వగైరా సామాన్లు కొందామని వెళ్ళాను. తోపుడు బండిలో సామానంతా వేసుకొని చలికాలం ఏ క్రీమ్ వాడితే బాగుంటుందో, తక్కువ ధరలో ఏం దొరుకుతుందో క్రీమ్ సీసాల్ని పరిశీలిస్తున్నాను.

"సుశీ" అని అరుపులాంటి గొంతు వినిపించింది. ఎవరా అని తలెత్తి పక్కకు చూస్తే సత్య!

"హాయ్! ఎల్లా వున్నావు? చాలా రోజులైంది నిన్ను చూసి సత్యా" అన్నాన్నేను.

"అవునే. నేను కూడా నిన్ను చూసి చాలా రోజులైంది. ఎట్లున్నావ్ నువ్వు" అంది సత్య.

సత్యకు ఎప్పుడూ ప్రశ్నకు ప్రశ్న వేయటమేగాని జవాబు చెప్పటం అలవాటు లేదు. జవాబు చెప్తే తన రహస్యమేదో ఎదుటివాళ్ళకు తెలిసిపోతుందన్నంత జాగ్రత్తగా వుంటుంది.

"నీకో విషయం తెలుసా?" అడిగింది సత్య

"ఏ విషయం" కనుబొమలు ముడేసాన్నేను.

"అదే! సునామీ గురించి"

"అవును చాల ఘోరం జరిగింది" విచారంగా వుంది నా గొంతు.

"అదే! ఆ సునామి ఎందుకు వచ్చిందో... ఆ ఘోరమైన ప్రకృతి ప్రమాదం ఎందుకు సంభవించిందో తెలుసా నీకు?" సత్య కళ్ళల్లో మెరుపు కన్పించింది. ఏదో ప్రకృతి రహస్యం అంతా తనకు తెలిసిపోయిన విజయ గర్వం గొంతులో ధ్వనించింది.

"ఎందుకు వచ్చింది? " అర్థంకాని ప్రశ్న నా గొంతులో.

"రాహుదశ బాగా లేదు. రాహు కేతువులు పోటీ పడ్తున్నాయి. గ్రహాలన్నీ వక్రదృష్టితో వున్నాయి. అప్పుడే ఇటువంటి భయంకరమైన ఉత్పాతాలు సంభవిస్తాయి మరి?" అంది సత్య ఏదో డిస్కవరీ చేసిన ఆనందంతో.

"ఈ రాహువు, కేతువుల్లో ఎప్పుడు పడ్డావే!" అడిగాన్నేను.

"అయ్యో! నీకు తెలియదానే! నేను జ్యోతిషంలో డిప్లొమా చేసాను. ఇంటి ముందు బోర్డుకూడా పెట్టేసాను. ఎంతో మంది వస్తుంటారు నా దగ్గరికి వాళ్ళ గ్రహదోషాలు తెలుసుకోవటానికి!" అంది సత్య.

అప్పుడు నేను సత్యను పరిశీలనగా చూసాను. పెద్ద జరీ అంచు పట్టుచీర. నొసట ఎర్రబొట్టు దాని కింద గంధం అక్షతలతో కూడిన బొట్టు. నెత్తిమీద వెంట్రుకల్లో చిక్కుకొని మరికొన్ని ఎరుపు పసుపు రంగుల్లో బియ్యం గింజలు! నిజంగా ఏదో మునపటిలాగాకాక వేరే సత్యలాగా... బాగా సంపదల్లో తేలియాడుతున్నట్లు కన్పించింది.

"రాహు పూజచేస్తే ఇదంతా సంభవించేదే కాదు"! అంది సత్య.

నేను ఏం మాట్లాడకుండా మాట మార్చేసాను.

ఆ మర్నాడు ఒక ప్రసిద్ధ గాయని అన్నమాచార్య కీర్తనలు పాడుతున్నారు అని అంటే విందామని వెళ్ళాను నేను. జనం హాలు కిక్కిరిసిపోయి వుంది. ఆ గాయని పాడటానికి ముందు తనను పాడటానికి పిల్చిన వాళ్ళ ప్రాధాన్యతను గురించి పెద్ద ఉపన్యాసం ఇచ్చింది. పాట వినటానికి వచ్చిన నా వంటి వాళ్ళకు తేళ్ళు, జెర్రులు పాకినట్లుగానే వుంది. అది చాలక పిల్చినవాళ్ళు ఉప్పొంగిపోయి ఆ గాయనిని ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి అంతటిది అనేసరికి ఈ అతిశయోక్తులకు, ఉత్ప్రేక్షలకు ఎప్పుడు తెరపడ్తుందా అని అనుకుంటున్నాను అసహనంతో. ఇంతలో గాయని సునామీలోకి కూడా వెళ్ళింది. "మనిషి మనస్సుకు చాలా శక్తి వుంది. అందరూ ఆ శక్తినుపయోగించి ధ్యానం చేస్తే సునామీ వంటి ఘోరమైన ప్రకృతి ప్రమాదాలు సంభవించవు" అంది ఆ గాయని! సామూహికంగా మనుషుల ధ్యానశక్తికి ఎన్నో మహిమలుంటాయి అదంత ఉపయోగించక పోవటంతోనే సునామీలు వస్తున్నాయని తేల్చేసింది ఆ ప్రసిద్ధగాయని.

సరే! ఆ గాయని ఉపన్యాసాలతో నలిగిపోయిన పాటలు విని నేను లేచాను. హాలు బయటికి నడిచాను. ఎదురుగా తన కుటుంబంతో సరోజ కన్పించింది. వాళ్ళాయన వెంకటాచలం కూడా నాకు బాగా తెలుసు. పలకరింపులయ్యాక "ఈ సునామీ ఘోర భూకంపం ఎందుకు వచ్చిందో... కారణమేమిటో... మీకు తెలుసా?... సుశీలగారూ!" అడిగాడు వెంకటాచలం.

"ఏమోనండీ! నాకు తెలియదు" అన్నాన్నేను.

"అస్సలు సముద్రంలో భూకంపాలు వస్తాయని ఎప్పుడైనా విన్నామా? చదివామా? చెప్పండి?" వాదనలోకి దిగుతున్నట్లుగా వుంది అతని గొంతు. నేను ఏం మాట్లాడుకుండా అతని వైపు నిశ్శబ్దంగా చూసాను.

"ఈ సముద్రంలో భూకంపాలకు అలలు ఎగిరెగిరి భూమి మీదికి హఠాత్తుగా రావటం... ఇంతమంది చావటం... ఇదంతా శంకరాచార్యులను అరెస్టు చేయటమే కారణమండీ! అంత మహాత్ములను, పవిత్రమైన కంచికామకోటి పీఠాధిపతులను అరెస్టు చేసి పాపానికి ఒడిగట్టే దేవుడు ఊరుకుంటాడా అండీ! దేవుడు ఈ విధంగా తన కోపాన్ని ప్రదర్శించాడు. మహాత్ములను స్వాములను కష్టపెడ్తే ఈ పాపం ఊరికే పోదండి. దాని దారుణ ప్రమాణాలను అందరూ ఎదుర్కోవల్సిందే! మరి!"... చెప్పుకుపోతున్నాడు వెంకటాచలం.

జైళ్ళో పెట్టినవాళ్ళు బాగానే వున్నారు క్షేమంగా. అమాయకమైన సామాన్య ప్రజలు అందులో ఒక్క మన దేశం కాదు ఆరు దేశాల ప్రజలు మృత్యువుపాలయ్యారు. మిగిలినవాళ్ళు తమ బంధుమిత్రులను పోగొట్టుకొని నిరాశ్రయులై పరితపిస్తున్నారు. దేవుడు... వుంటే... ఇంత నిర్దాక్షిణ్యుడా? ఆశ్చర్యమేసింది నాకు.

❀

మాదుగుండు కృష్ణ



తప్పు దారి

వీరయ్యకు ఊహ తెలిసేనాటికే తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో అన్న భార్య అన్నపూర్ణ అతడిని పెంచి, పెద్ద చేసింది. కానీ ఆర్థిక ఇబ్బందుల వల్ల పెద్దగా చదివించలేకపోయాడు అన్న రాఘవయ్య. బడికెళ్లాల్సిన వయసులోనే బట్టల షాపులో గుమస్తాగా కుదిరాడు. యుక్తవయసు రాగానే ఓ చక్కటి అమ్మాయితో వీరయ్యకు వివాహం జరిపించాడు రాఘవయ్య.

కొద్ది కాలానికే వీరయ్య భార్య విజయమ్మ లక్షణాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. విజయమ్మ దుబారా మనిషి. దుడుకుతనం కలది కూడా. మాటల్లో నిలుపు, నిదానం లేదు. చిన్నా, పెద్దా లేకుండా పోరుకు సిద్ధపడుతుంది. అలాంటి ఆమె వేరు కాపురం పెట్టాల్సిందేనని పట్టుపట్టింది. భార్య మాట కాదనలేక వెనకా ముందూ ఆలోచించకుండా బంధాలు తెంచుకొని బయటపడ్డాడు వీరయ్య.

వేరు కాపురంలో సుఖముంటుంది. జీవనం హాయిగా సాగుతుందనుకున్న వీరయ్యకు భార్య వల్ల సమస్యలు ఎదురయ్యాయి. విజయమ్మ కోరికలకు అంతం లేకుండా పోయింది. 'వస్తున్న జీతమేమో రవ్వంత. మరి తీర్చడం ఎలా?' అని సందిగ్ధంలో పడ్డాడు. అడిగినవి తేకపోతే మండిపడుతుంది భార్య.

ఫలితంగా క్రమేణా వీరయ్యలో సహనం నశించింది. "నా పని... నా జీతం సంగతి నీకు తెలుసు కదా. మరి నువ్వు కోరినవన్నీ నేనెలా తెచ్చిపెట్టేది?" అంటూ కోప్పడ్డాడు విజయమ్మ మీద. "సంపాదించడానికి మనసుండాలే కాని మార్గాలెన్నో. ఎలా సంపాదించాలంటావేం? నువ్వేం మగాడివి?" అని చిరాకుపడింది విజయమ్మ. దాంతో సంపాదన కోసం అతని మనసులో ఆలోచనలు బయలుదేరాయి. ఒక నిర్ణయానికి వచ్చాడు.

✿ ✿ ✿

అప్పటినుంచి వీరయ్య చేతిలో డబ్బు పుష్కలంగా వుంటోంది. విజయమ్మ చెప్పాలే కానీ నిముషాల్లో వస్తువు ఒడిలో వుంటోంది. విజయమ్మ ఒంటి నిండా ఆభరణాలే. ఇంటి నిండా అలంకరణ వస్తువులే. ఖరీదైన కళ్లజోడు. ఎత్తైన జోళ్లు. నైసైన నూలు చీరలు. వీటితో విజయమ్మ విజయరాణిలా మెరిసిపోతోంది.

✿ ✿ ✿

కానీ...ఒకరోజు హఠాత్తుగా పోలీసులు వీరయ్య ఇంటికి వచ్చారు. 'ఎందుకు? ఏంటి?' అని అడిగేలోపే వీరయ్య చేతులకు సంకెళ్లు తగిలించి, తీసుకెళ్లారు. విజయమ్మ కారణం తెలుసుకునేంతలో వీధిలో వాళ్లు గుసగుసలు మొదలెట్టారు. "వీరయ్య దొంగతనం చేశాడు. అదీ తాను పని చేస్తున్న షాపులోనే. ఈ తతంగం ఎన్నోరోజులుగా సాగిందట. ఇప్పుడు బయటపడింది'' అని వాళ్లు చెవులు కొరుక్కున్నారు. పరువు పోయి విజయమ్మ దిక్కుతోచక నిలబడింది.

భార్య కోర్కెలు తీర్చడం కోసం అక్రమార్జనకు అలవాటు పడినందుకు తనకిది తగిన శిక్షే అనుకున్నాడు వీరయ్య. కోర్టు అతనికి జైలు శిక్ష విధించింది.

అప్పుడు విజయమ్మ ఎంతగానో దుఃఖించింది. ఇది తాను చేతులారా చేసుకున్న తప్పిదమేనని గుర్తించింది. ఇహ అలాంటి తప్పు జన్మలో చెయ్యకూడదని కూడా నిశ్చయించుకుంది.



చిన్నారి చిత్రకారులు



ఎస్.సాయికుమారి, 8వ తరగతి,
గవర్నమెంట్ ఎస్ డబ్ల్యు గరల్స్ హాస్టల్, వీరవాసరం, ప.గో.



పి.బాలమణి, 10వ తరగతి, ఎస్ఎస్ గుట్ట హైస్కూల్,
వెంకటేశ్వరకాలనీ, మహబూబ్‌నగర్.

ఆర్.ఐలయ్య, 9వ తరగతి, జిల్లాపరిషత్ సెకండరీ స్కూల్,
వీణవంక, కరీంనగర్.

మీరూ ఈ నేస్తాలకు మల్లే చక్కటి బొమ్మలు వెయ్యగలరా! మరి ఆలస్యం ఎందుకు? ఎంచక్కా వేసి మాకు పంపిస్తే ప్రచురిస్తాం. మా చిరునామా: **చిన్నారి చిత్రకారులు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

నా ప్రత్యేకత ఏంటి?



హాయ్! ఏంటీ? అలా ఆశ్చర్యంగా చూస్తున్నారు? ఆవు వచ్చింది' నా? మీ కోసమే వచ్చిందర్రా! నిజ్జం. ఎందుకనుకున్నారు? మనలో మాట. దానికి కాస్త బడాయిలు ఎక్కువ. ఫోజులు కొడుతుంటుంది. అన్నట్టు అది మిమ్మల్ని ఏదో అడుగుతుందంట. ఎందుకైనా మంచిది జాగ్రత్తగా సమాధానం చెప్పండర్రా! మన గౌరవం కాపాడాలి. సరేనా! అంబా... నేస్తాలూ! నా బొమ్మ చూశారుగా. అందులో ఓ ప్రత్యేకత వుంది. అదేంటో కనుక్కోండి చూద్దాం. ఏంటి తెలీలేదా? బాగా చూసి చెప్పండర్రా! ఇంకా తెలీలేదా? అయితే పేజీ తిరగేసి చూడండి.

జవాబు నా వీపుమీద ఓ దేశ పటం వుందర్రా! అదేంటంటే... యునైటెడ్ కింగ్‌డమ్.

వి'చిత్రం'

బుడుగులూ! ఇవాళ్టి వి'చిత్రం' ఎప్పటిదనుకున్నారు? మొదటి ప్రపంచ యుద్ధం నాటిది. ఆ యుద్ధం ప్రారంభమయ్యే నాటికి జర్మనీ రాజుగావున్న కైజర్ ఈ బొమ్మలో వున్నాడు. మీరు ఆయనను వెతికి పట్టుకోవాలి మరి.

ఏంటి? మీకెవరికీ ఆయన కనిపించలేదా! మీరు పుస్తకాన్ని రెండు చేతులతో పట్టుకుని వున్నారుకదా. సరిగ్గా అటువైపు నిలువుగా తిప్పాలి. మీ కుడిచేతివైపు పుస్తకం పైకి రావాలి. ఇప్పుడు పులి ముక్కు దగ్గర మీ అరచేతిని పెట్టి చూడండి. పులి కళ్లపైన కైజర్ కనిపిస్తాడు. ఎడమవైపుకు చూస్తూ వుంటాడు. కనిపించాడా! మరి ఇంత మంచి బొమ్మ వేసిన ఆర్టిస్టు అంకుల్‌ని అభినందించాల్సిందే కదూ. మరైతే చప్పట్లు చరచండి. మీ ఫ్రెండ్స్‌ని కూడా ఈ ప్రశ్న అడిగి చూడండి.

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

హేయ్ నేస్తాలూ! ఈ వారం కూడా అనుకోకుండా మీ ముందుకు ఓ గొప్ప నటుడు వచ్చారు. **'మొగాంబో ఖుష్ హువా'** అనేది ఈయన పాపులర్ డైలాగ్. ఈపాటికి ఆయన ఎవరో మీకు తెలిసిపోయినట్టుందే. మరైతే వెంటనే కార్డుమీద రాసి మాకు పంపండి. మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

సరైన సమాధానాలు రాసినవారు

జి.లక్ష్మణ్, 10వ తరగతి, జి.తేజ, 6వ తరగతి, కె.సరిత, ఎస్.లక్ష్మి, 9వ తరగతి, వనపర్తి. పి.రాజేష్, 9వ తరగతి, పి.స్వరూప, 10వ తరగతి, ఈమని. కె.శ్రీఅనూష్య, 6వ తరగతి, గుంటూరు. కె.ధరణ్‌కుమార్, 8వ తరగతి, రాజాం. పి.వినోద్‌కుమార్, 7వ తరగతి, దేశినేనిపాలెం. షహబాజ్ బాను, 7వ తరగతి, చందోలు. బి.సృజన, 7వ తరగతి, గీతాంజలి హైస్కూల్, చిక్కడపల్లి, హైదరాబాదు. ఎ.సాహిత్యలోహిత, 3వ తరగతి, పాలకొల్లు. జి.సాయిభరత్‌రెడ్డి, 6వ తరగతి, మోదుకూరు. ఎం.పూజితారాణి, 7వ తరగతి, ఎం.యశ్వంతి,4వ తరగతి, కొవ్వూరు. పి.మాధవి, 1వ తరగతి, విశాఖపట్నం. ఎ.వి.రాంబాబు, గురజాల.

గతవారపు జవాబు:
మహానటి సావిత్రి

తేడాలు కనుక్కోండి



ఈ రెండు బొమ్మల్లో ఆరు తేడాలున్నాయి. అవేంటో ఇట్టే కనిపెట్టాలి.

బెక బెక కావాలా!

నేస్తాలూ! మీకు బెక బెక కావాలా? ఏంటీ అలా చూస్తున్నారు? బెకబెక అంటే కప్ప. అదీ కాగితపు బెకబెక కావాలా? అని అడుగుతున్నాం. ఓకే. అయితే



ఏమేం కావాలంటే... కాగితం, కత్తెర, పెన్సిల్, క్రేయాన్లు.

ఎలా చెయ్యాలంటే... ముందు 21 సెంటీమీటర్ల పొడవు, 6 సెంటీమీటర్ల వెడల్పు వున్న మందపాటి కాగితం తీసుకోండి. దాన్ని మూడు భాగాలుగా విభజించాలి. అంటే ఒక్కో భాగం 7 సెంమీ వుండాలన్నమాట. తర్వాత అటు చివరి, ఇటు చివరి భాగాలను రెండు భాగాలుగా విభజించుకోవాలి. అచ్చం రెండవ బొమ్మలో చూపించినట్టున్నమాట. దాన్ని మూడో బొమ్మలోలాగా మడవాలి. ఇప్పుడు ఒక చివరను కిందకి మడవాలి (4వ బొమ్మ). తర్వాత 5వ బొమ్మలోలా మూలలు కొద్దిగా కత్తిరించాలి. తర్వాత ఆ కాగితాన్ని కాళ్లకులాగా కత్తిరించాలి. ఇప్పుడు వెనుకవైపు మడతలను మరోసారి మడవండి. ఇప్పుడు కప్ప కాళ్లు, కళ్లు, నోరు, చుక్కలు గియ్యండి. వీటికి క్రేయాన్లు అద్దండి. తర్వాత మీ చూపుడు వేలితో కప్ప వెనుక కాళ్లను కొద్దిగా ఒత్తి చూడండి. ముందుకు కదులుతుంది. ఇలాంటి బెకబెకలు రెండు మూడు తయారుచేసి మీ నేస్తాలతో కలిసి కప్పలపోటీ పెట్టొచ్చు.









పేపర్ బొమ్మలు చెయ్యడం మీకూ వచ్చా?

ఫ్రెండ్స్! మీకు వారం వారం పేపర్‌తో బొమ్మలు చెయ్యడం నేర్పిస్తున్నాం కదా. ఇలాంటివి చెయ్యడం మీకూ వచ్చేవుంటుంది. కార్డుమీద వివరంగా రాసి పంపిస్తే ఎంచక్కా మీ పేరు, తరగతి, ఊరుతో సహా ప్రచురిస్తాం. మా చిరునామా: పేపర్ బొమ్మలు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

తలవంచిన ఎవరెస్టు

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

ఎటు చూసినా మంచు....
కనుచూపు మేరలో హిమాలయ పర్వత శిఖరం....
మంచు తెరలు తెరలుగా కమ్ముకుంటోంది.

ఎరిక్ వీన్‌మెయర్ కోటు సర్దుకున్నాడు. చలి నుంచి రక్షణ కోసం అతను చేసుకున్న ఏర్పాట్లు చక్కగా కుదిరాయి.

8,850 మీటర్లు అంటే 29,035 అడుగుల ఎత్తున్న ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి అతను చేసిన ప్రయత్నాన్ని చూసిన వారు భయపడ్డారు. రిస్కు ఎందుకని వారించారు. కష్టసాధ్యమైన పనిని ఒంటరిగా ఎందుకు అని నిరాశ పరిచారు.

అయినా ఎరిక్ వెనుకంజ వేయలేదు.

తన జీవిత లక్ష్యం సాధించడానికి ఒంటరిగా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి ముందుకు అడుగువేశాడు. తనను వద్దన్న వారిని కలుసుకుని ఎలాగైనా ఎక్కగలనన్న విషయాన్ని వారికి ధృడంగా చెప్పాడు.

అతని ఉత్సాహం... పట్టుదల... ఆత్మవిశ్వాసం ఎవరినీ మరి ఎదురు చెప్పనీయలేదు.

2001 మార్చిలో తన ప్రయాణానికి శ్రీకారం చుట్టాడు.

అడుగడుగునా పొంచి ఉండే మృత్యువును దాటుకుంటూ ఎవరెస్టును అధిరోహించడం అంత తేలిక కాదు. బయలుదేరిన వారిలో భయంతో సగం మంది మధ్యలోనే వెనక్కి తిరిగి వస్తుంటారు. ఆక్సిజన్ అందక, లోయల్లో పడిపోవడం, మంచు ప్రవాహాల్లో కొట్టుకుపోవడం, కొండ చరియలు విరిగిపడటం, హఠాత్తుగా మంచు తుపాన్లు రావడంతో ఎవరెస్టు ఎక్కేవారిని అనేక రకాలుగా చావు వెంటాడుతుంది.

ఇవన్నీ వీన్‌మెయర్‌కు తెలుసు
అయినా నిరాశ పడలేదు.

రెండు సంవత్సరాల పాటు ఎవరెస్టు శిఖరం ఎక్కడానికి వీలుగా శిక్షణ పొందాడు. ఎలాగైనా సాధించాలన్న పట్టుదల శిఖరం పైకి అడుగులు వేయించింది.

"రెస్టు తీసుకుందామా?" ఎరిక్ సహాయకుడ్ని అడిగాడు. ఆ మాట కోసమే విల్సన్ ఎదురు చూస్తున్నాడు.

ఆ పక్కనున్న చదునుగా ఉన్న ప్రాంతాన్ని సరిచేసి బేగులో తీసుకువచ్చిన సామాగ్రితో చిన్న గుడారాన్ని ఏర్పాటు చేశాడు. విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా ఏర్పాట్లు చేశాడు.

సూర్యాస్తమయం అయినట్లుగా ఉంది. చీకటి కమ్ముకుంటోంది.

కొండ శిఖరంపై అదోలాంటి నిశ్శబ్దం కలవరపెడుతోంది. మంద్రంగా వీస్తున్న గాలి అదోలాంటి శబ్దాన్ని ఉండి ఉండి మోసుకువస్తోంది.

ఎరిక్ వీన్‌మెయర్ కళ్లద్దాలను సరి చేసుకున్నాడు. వీపు వెనుక బరువుగా ఉన్న ఆక్సిజన్ సిలెండర్‌ను కాస్త వదులుచేసి గుడారంలోకి దూరాడు.

విల్సన్ అప్పటికే స్నాక్స్‌ను సిద్ధం చేశాడు. పక్కన చిన్న మంట రాజేసి టీ మరిగించడం మొదలు పెట్టాడు. ఎరిక్‌కు చాలా ఉద్విగ్నంగా ఉంది. తన ప్రయాణంలో మజిలీ అతనికి కొత్త కాదు. ఎంత తొందరగా శిఖరాగ్రాన్ని చేరుకుంటానా అని అనిపిస్తోంది.

తనతో బయలుదేరిన ఇతర బృందాలు కూడా పరిసర ప్రాంతాల్లోనే గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతివారు తమ గుడారాల ముందు చిన్న చిన్న మంటలు వేసుకున్నారు.

"విల్సన్! నీకు బోర్‌గా ఉంది కదూ ?"

విల్సన్ ఏమీ మాట్లాడలేదు. వినిపించలేదేమోనని దూరంగా ఉన్నాడనుకుని మరోసారి గట్టిగా ప్రశ్నించాడు.

అప్పుడు విల్సన్ నోరు విప్పాడు.

"సార్! నాకు ఇది కొత్త అనుభవం.... గతంలో కూడా కొంత మందికి సహాయకుడిగా ఈ ప్రాంతాలను చూశాను. మీతో రావడం గొప్ప అనుభవం అవుతుందనుకుంటున్నాను. మీ విజయంలో నాకూ భాగస్వామ్యం ఉందని చెప్పుకోవడం గర్వంగా ఫీల్ అవుతాను" అన్నాడు. తర్వాత పేపర్ ప్లేటులో స్నాక్స్ పెట్టి ఎరిక్ వద్దకి వచ్చి అతని చేతులను పట్టుకుని ప్లేటు చేతుల్లో పెట్టాడు!

ఎరిక్ వినమెయర్ స్నాక్స్ అందుకున్నాడు.

"సార్! ఈ కొండ... ఈ పరిసర దృశ్యాలు ఎంతో అందంగా ఉన్నాయి. చీకటి చిక్కబడుతున్న సమయంలో అక్కడక్కడ వెలగించిన నెగళ్ళ వెలుగులు.... ఆ వెలుగుల్లో ప్రతిఫలిస్తున్న తెల్ల కొండలు మహత్తరంగా ఉన్నాయి... చూసి తీరవలసిందే..." అన్నాడు.

అలా అన్న తర్వాత ఎరిక్‌వైపు చూశాడు.

కళ్లద్దాలు తీసి అతను కళ్లు తుడుచుకుంటున్నాడు. మంచంలో కూడా వెచ్చని కన్నీళ్ళు అతని కను కొలకుల్లోంచి బైటికి ఉబుకుతున్నాయి. ఆ ప్రాంతాన్ని వర్ణించి ఎంత తప్పు చేశానో విల్సన్‌కు అర్థమైంది. "సారీ సర్!" అన్నాడు నెమ్మదిగా.

"ఇట్సాల్ రైట్!" ఎరిక్ వీన్‌మెయిర్ సర్దిచెప్పాడు.

తర్వాత కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకున్నాడు. ఆ కళ్లు మూసుకుపోయి ఉన్నాయి. కళ్లస్థానంలో గుంటలు మాత్రం ఉన్నాయి. ఎరిక్ కళ్లద్దాలను పెట్టుకుని "నాకు ఏమీ కనిపించకపోయినా నువ్వు చెప్పిన అందమైన దృశ్యాన్ని నా మనోఫలకంపై ఊహించుకోగలను-" ఎరిక్ ఎంత మామూలుగా చెప్పాలనుకున్నా అతని మాటల్లో సన్నటి జీరని విల్సన్ గమనించకపోలేదు.

గుడారంలో వెచ్చగా ఉంది.

బైట మంచు కురుస్తూనే ఉంది.

* * *

ఎరిక్ వీన్‌మెయర్ అమెరికాలో కొలరాడో ప్రాంతానికి చెందినవాడు. మధ్య తరగతి కుటుంబంలో మూడవ సంతానంగా పుట్టాడు. పన్నెండేళ్ళ వయసు వచ్చేంత వరకూ అందరి పిల్లలతో ఆటపాటలతో నవ్వుతూ తుళ్లుతూ జీవితాన్ని ఎంజాయ్ చేశాడు.

పదమూడవ సంవత్సరంలో అడుగు పెట్టడంతో పాటు అతని జీవితంలో దురదృష్టం కూడా అంధకారం రూపంలో ప్రవేశించింది. అంతవరకూ అందమైన కళ్లు లోకాన్ని చూసేవి. అప్పటి నుంచి ఆ కళ్లు శాశ్వతంగా మూతపడ్డాయి.

పుట్టుకతో అంధులైన వారికి రంగులు ఎలా ఉంటాయి? ప్రకృతి ఎలా ఉంటుంది? మనసుకు

ఆహ్లాదాన్ని కలిగించే దృశ్యాలు ఏమిటి అన్నవి అసలు తెలియవు. వారి ఊహకు కూడా అటువంటివి అందవు. అయితే పుట్టుకలో కళ్లుండి ప్రపంచాన్ని అందాలని, ఆనందాలను చూసినవారు ఒక్కసారిగా అంధులయిపోతే వారి జీవితం ఎంతో దయనీయంగా తయారవుతుంది.

పదమూడేళ్ల వయసులో ఎరిక్ జీవితం కూడా అలాగే దురదృష్టకరంగా తయారైంది. అనువంశికంగా వచ్చే వ్యాధి కారణంగా చూపును కోల్పోయాడు. శాశ్వత అంధత్వం ప్రాప్తించింది.

ఆపరేషన్ థియేటర్‌లో తన పరిస్థితి తలచుకుని దుఃఖంతో కుమిలిపోయాడు. లోకమంతా చీకటిమయం అయిపోయినట్లు బాధపడిపోయాడు. తీవ్రమైన నిరాశలో పూర్తిగా కూరుకుపోయాడు.

కంటిచూపు పోయిన తర్వాత తన మనసుకు తానే ధైర్యం చెప్పుకున్నాడు. ఏడుస్తూ కూర్చుంటే లోకమంతా దుఃఖసాగరంగానే అనిపిస్తుందని తనను తాను సమాధాన పరుచుకున్నాడు. జీవితం దానిని అనుభవించడానికి, పదిమందికి ఆదర్శవంతంగా చేయడానికీ ఈలోకంలో ఎన్నో మార్గాలు ఉన్నాయని భావించాడు.

ఎరిక్ వీన్‌మెయర్ చిన్నతనంలో సైక్లింగ్, బాస్కెట్‌బాల్ క్రీడల పట్ల ఎంతో ఆసక్తి చూపించేవాడు. చూపుపోయిన తర్వాత ఆ ఆసక్తి కొనసాగించడం కష్టమని గ్రహించాడు. తనలో ఉన్న క్రీడాస్ఫూర్తిని రెజ్లింగ్, ట్రెక్కింగ్ రాక్ క్లైంబింగ్‌వంటి క్రీడల పట్ల మళ్లించాడు. కళ్లు కనిపించకపోయినా వాటిలో కొంత ప్రావీణ్యతను సంపాదించాడు. అయినప్పటికీ వాటితో సంతృప్తి చెందలేదు. ఏదో సాధించాలి అందరిలో ఒక ప్రత్యేకతను కలిగివుండాలని నిశ్చయించుకున్నాడు.

ఫలితంగా పర్వతారోహణ మొదలుపెట్టాడు.

ముందు తను నివసించే నగరాల సమీపంలో ఉన్న చిన్న చిన్న కొండలను ఎక్కేవాడు. ఏమీ కనిపించకపోయినా అంచనాతో అతను చేసిన ప్రయత్నాలు విజయవంతం అయ్యాయి.

అమెరికా, కెనడాలలో అన్ని పర్వతాలను అధిరోహించాడు. అంధత్వంతో అతను చేస్తున్న ప్రయత్నాలు చాలా సాధారణ వ్యక్తులకు భిన్నంగా అతను వేసే అడుగులు చూసేవారిని ఆకట్టుకొనేవి.

ఒక్కొక్క సంవత్సరంలో ఒక్కో పెద్ద పర్వతాన్ని ఎక్కాలని ఎరిక్ లక్ష్యంగా పెట్టుకొనేవాడు. అందుకోసం ముందుగా అవసరమైన శిక్షణ తీసుకొనేవాడు. శిక్షణకు ఏమాత్రం తీసిపోనివిధంగా ఆయా పర్వతాలను అవలీలగా అధిరోహించి విజయపతాకాలను ఎగరవేసేవాడు.

1995లో అలస్కాలోని మెకన్లీ, 1997లో టాంజానియాలోని కిలియంజారో, 1999లో అర్జెంటీనాలోని అకాన్ కాగ్వా, 2001లో అంటార్కిటికాలోని విన్సన్ మానిఫ్ వంటి పేరెన్నికగన్న పర్వత శిఖరాలన్నీ ఎరిక్ విజయయాత్ర ఖాతాలో చేరిపోయాయి.

ప్రపంచంలో అత్యున్నత శిఖరాలన్నీ అయిపోవడంతో అతని దృష్టి భారతదేశంలో ఎవరెస్టు పర్వతంపై పడింది. పర్వతారోహకులందరికి ఎవరెస్టు లక్ష్యంగా ఉండటం దానిని అధిరోహించినట్లయితే తన అభిరుచికి పరాకాష్టకు చెల్లినట్లు అవుతుందని అనుకున్నాడు.

చాలామంది ఆ ప్రయత్నం వద్దని సలహా ఇచ్చారు. ఇతర పర్వతాలకన్నా ఎవరెస్టు భిన్నమైదని మంచుపర్వతమని, నిరంతరం ప్రమాదాలమయంగా ఉంటుందని అంధత్వంతో ఎక్కడం చాలా కష్టమని అన్నారు.

ఆ మాటలు వింటున్న కొద్దీ ఎరికలో ఉత్సాహం మరింతగా ఇనుమడించిపోయింది. ఎలాగైనా ఎవరెస్టును ఎక్కాలి. ఆ పర్వతాన్ని ఎక్కిన అంధుడిగా తన పేరు చిరస్థాయిగా నమోదు చేసుకోవాలని దృఢ నిశ్చయానికి వచ్చి అందుకు తగిన ప్రయత్నాలు ప్రారంభించాడు.

'నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్" అనే సంస్థ అంధుడైన ఎరిక వీన్‌మెయర్‌కు రెండున్నర లక్షల డాలర్లు స్పాన్సర్ చేయడానికి ముందుకు వచ్చింది. ఎరిక్ అంధుడు అయినందున అతని ప్రయత్నానికి సహకరించడానికి ఆ సంస్థ ఒక బృందాన్ని నియమించి ఆ బృందం పర్యవేక్షణలో పర్వతారోహణ చేయడానికి

ఏర్పాట్లు చేసింది.

ఎవరెస్టు శిఖరం చేరేదారిలో మొదటి మజిలీని బేస్‌కేంప్ అంటారు. ఇది శిఖరంలో 5,365 మీటర్ల ఎత్తులో ఉంది. దీని తర్వాత కేంప్‌వన్‌కు చేరాలి. ఈ రెండింటి మధ్య అతి ప్రమాదకరమైన 'కుంభు హిమపాతం' ఉంది. దీనిని దాటినట్లయితే తర్వాత ప్రయాణం సులభంగానే సాగిపోతుంది. ఈ ప్రాంతంలో ఈ హిమపాతాన్ని దాటడానికి దారితెన్నూ లేకపోవడంతో ఎరిక్ ప్రయత్నం చేసిన ప్రతిసారీ ఆటంకాలు ఎదురయ్యేవి. వాతావరణం బాగాలేక నాలుగైదు సార్లు వెనక్కి రావడం జరిగింది.

మొదటి ప్రయత్నంలో 13 గంటల సమయం వెచ్చించినా ఫలితం లేకపోయింది. చివరి ప్రయత్నంలో 5 గంటల 23 నిమిషాల్లో అధిగమించాడు. ఎంతోమంది పర్వతారోహకులన్నా ఎరిక్‌కు ఈ ప్రయత్నం సులభసాధ్యం అయింది.

ఎంతోమంది పర్వతారోహకుల వెనుక సహాయకుడిగా బయలుదేరిన విల్సన్ కూడా ఎరిక్ పట్టుదలకు ఆశ్చర్యపోయాడు.

* * *

మంచుకొండల్లో ప్రయాణం కొనసాగుతోంది.

కళ్లు కనిపించకపోయినా అడుగులో అడుగు వేసుకుంటూ ఎరిక్ ముందుకు కదులుతూనే ఉన్నాడు.

లక్ష్యం కళ్లకు కనిపించకపోయినా మనసుకు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకొక్క అడుగు ముందుకు పడుతుండటంతో అతని మనసులో అదోలాంటి దృఢత్వం ఆత్మవిశ్వాసం పేరుకుపోతోంది.

విల్సన్ అన్నిరకాల సహాయ కార్యక్రమాలు, ఎప్పుడు అవసరమైనవి అప్పుడు సమకూరుస్తూ సహాయపడుతున్నాడు.

కొండ శిఖరాగ్రం సమీపించే సమయంలో ఏటవాలుగా గోడమాదిరిగా ఉండటంతో ఎక్కడం కష్టం అవుతోంది. అయినా అతి కష్టంపైన ముందుకడుగు వేస్తున్నాడు.

కొండ చరియలు విరిగిపడ్డాయి. మంచు తుపాన్‌లు చుట్టుముట్టాయి. ఆక్సిజన్ సమస్య ఏర్పడింది. అయినప్పటికీ వాటినన్నింటినీ ఎరిక్ అధిగమించాడు. తన పట్టుదల ముందు ఈ సమస్యలు చాలా చిన్నవిగా అనిపించాయి. 2001 మే 25న హిమాలయాల్లో అత్యున్నతమైనదిగా భావించిన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాడు.

ఉపరితలంపైకి చేరుకోగానే సంతృప్తిగా గాలిపీల్చుకున్నాడు. శిఖరాగ్రాన్ని ఆనందంతో ముద్దుపెట్టుకున్నాడు. తనతో తెచ్చుకున్న జెండాను పాతాడు.

ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న క్షణం ఎదురవ్వడంతో ఎరిక్ ఆనందంతో పొంగిపోయాడు.

* * *

అమెరికాలో కొలరాడో ప్రాంతం.

వంటరిగా ఉన్న ఇంట్లో ఎరిక్ వీన్ మెయర్ కూతురు ఎమ్మాను ఒడిలో కూర్చోబెట్టుకుని కబుర్లు చెబుతున్నాడు.

ఏడాది వయస్సున్న ఎమ్మీ అంటే అతనికి ఎంతో ప్రాణం. రెండేళ్ల క్రితం ఒకప్పటి తన క్లాస్‌మేట్ ఎల్లీరీవ్‌ను ప్రేమించి పెళ్లాడటంతో ఎరిక్ జీవితంలో పెద్ద మార్పుకు నాంది పలికింది. తనకు కళ్లు లేకపోయినా తన కృషిని పట్టుదలను ప్రేమించిన రీవ్ తన జీవితంలో ప్రవేశించడం గొప్ప అండ దొరికినట్లయింది. ఆమె తోడు ఉన్న జీవితంలో గొప్ప తృప్తిని కలిగిస్తోంది.

"ఏమండీ! ఎవరెస్టును అధిరోహించి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు... మీ ఆకాంక్ష నెరవేరినట్లే కదా?" భార్య ఎల్లీరీవ్ అడిగింది.

ఎరిక్ తల అడ్డంగా ఊపాడు.

తర్వాత నెమ్మదిగా చెప్పాడు - "నా అనుభవాలతో ఎవరెస్టు అధిరోహణ గూర్చి 'టచ్ ది టాప్ ఆఫ్ ది వరల్డ్' పేరుతో ఆత్మకథ రాస్తున్నాను-" అన్నాడు.

"రాయండి అంతేకదా?"

"రాయడంతోబాటు యూరప్‌లో ఎల్‌బరేన్ పర్వతం, ఆస్ట్రేలియాలో కార్స్‌టెంజ్ పిరమిడ్‌లను అధిరోహించినట్లయితే ప్రపంచంలో ఏడు ఖండాల్లో అన్ని శిఖరాలను అధిరోహించినట్లవుతుంది..." ఎరిక్ చెప్పుకుపోతున్నాడు.

"ఇంకా ఇన్ని ఆశలు ఉన్నాయా?" భార్య రీవ్ బుంగమూతి పెట్టి ప్రశ్నించింది.

తల్లిని చూసి ఎమ్మా కేరింతలు కొట్టింది.

ఎమ్మాను ఎరిక్ గుండెలకు హత్తుకున్నాడు.

*

"అమ్మీజాన్...ఎందుకిలా...?!"

త్రినేత్రి

"నాకైతే నమజ్ కావట్లేదు అమ్మీజాన్" అన్నాను.

మా అమ్మీజాన్ అంటే నాకు...మా అందరికీ ప్రాణమే. అందుకే అందరిళ్ళలోలాగా కాక అమ్మీ...జా...న్ అని ఆ పిలుపు చివరనున్న 'జాన్' ని చాలా ఇష్టంగా పలుకుతాం.

మా అమ్మే... అబ్బాజాన్‌కి నచ్చజెప్పి ఆడపిల్లలమైనా మా ముగ్గుర్నీ చదివిస్తోంది. కాలేజీకూడా వెళ్తున్నామంటే మా అమ్మీజాన్ పట్టుదల కూడా ఉంది.

అబ్బాజాన్ వాళ్ళ పెద్దలందరూ రెండేసి, మూడేసి నిఖాలు చేసుకున్నవారే. కానీ అబ్బాజాన్‌కి మాత్రం అమ్మంటే ఎంత ప్రాణమో! మేం పుట్టడానికి చాలా ఏళ్ళు ఆలస్యమైతే బంధువులెంతోమంది ఎంత బలవంతపెట్టినా మరో నిఖా చేసుకోలేదు.

అందుకనే కాక మమ్మల్ని కాలేజీలక్కూడా పంపి చదివించుతున్నాడనీ దాదీమా వాళ్ళకు బాగా కోపం.

ముల్లా-ఖాజీల మాటకు గౌరవం ఇవ్వకపోతే ఖబరస్థాన్‌లో చోటు ఇవ్వరనీ ఇంకా ఏవేవో భయాలు కొద్దిగా అబ్బాజాన్‌ను అప్పుడప్పుడు పట్టుకుంటాయి.

అప్పుడు మాత్రం మమ్మల్ని, మా అమ్మనూ తెగ తిట్టిపోస్తారు. బేటీల్నే కానీ ఒక్క బేటాను కూడా ఇవ్వలేదని అమ్మను తెగతిడతారు. మమ్మల్ని చుట్టాలింటికో, షాదీ బారాత్‌లకో వెళ్ళేపుడు బురఖా వేసుకుని వెళ్ళండో అని కాస్సేపు గుస్సాగా మాట్లాడుతారు.

అప్పుడందరం ఖామోష్..!

అబ్బాజాన్ అంతకుముందేమో గానీ...

మా అత్తమ్మను అంటే మా అబ్బాజాన్ పెద్దక్కను వాళ్ళాయన అకారణంగా తన్ని, తలాక్ తలాక్ తలాక్ అని మూడుసార్లు అనేసి పుట్టింటికి తరిమేసినప్పటి నుంచి ఆయనలో ఒక మార్పు వచ్చిందని అమ్మ చెప్పేది.

అబ్బాజాన్‌కి వాళ్ళ పెద్దక్క అంటే ఎంతో ఇష్టం.

బహుశా అందుకేనేమో...అబ్బా తన అక్కలాంటి మహిళేనని అమ్మను ఎంతో ఇష్టంగా, ప్రేమగా చూసుకుంటారు. మమ్మల్నీ ముద్దుగానే చూస్తారు.

విడాకుల విషయంలో ఈ మధ్యన మనవాళ్ళు మంచిగానే మాట్లాడుతున్నారు కదమ్మా అంటే...

అలా ఓ పదేళ్ళక్రితం నుంచే మంచిగా ఆలోచించడం చేసుంటే అత్తమ్మకి అలా అయ్యేది కాదని అమ్మంటుంటే...

అసలెందుకిలా అమ్మీజాన్?... అని ఎన్నిసార్లు అడిగానో...

ఎన్నిసార్లడిగినా...అలా అనకూడదు బేటీ...మన పెద్దవాళ్ళు ఎందుకు పెట్టారో...అది మనం అడక్కూడదమ్మా. మనమే మన కట్టుబాట్లమీద వేలెత్తి చూపినట్లవుతుంది. మన పెద్దవాళ్ళకు కోపం తెప్పించడం మంచిదికాదు అనంటుంది.

మా క్లాసులో పద్మ వాళ్ళనాయన చెప్పాడని మన గురించి అవమానకరంగా మాట్లాడిందమ్మా అని చెప్పానా... అలాంటివి వినవద్దని, అలా వినాల్సివచ్చినా వాళ్ళతో వాదులాటకు దిగొద్దని చెప్పింది.

పద్మవాళ్ళనాన్న అదేదో కమలంపువ్వు గుర్తు పార్టీలల్లో తిరుగుతారు కదా... వాళ్ళ పెద్దాళ్ళు ఎలా చెబితే అదే మాట్లాడుతారు కదా అనంది.

వాళ్ళెవరో అలా అన్నారు, ఇలా అన్నారు కాదుకానీ మనవాళ్ళకూ ఉండాలి బుద్ధి అని అత్తమ్మ గయ్యిమంది. అలా అత్తమ్మ అనడం వెనుక ఎంత బాధ వుందో...



అమ్మ మాత్రం అత్తమ్మ మాటలు దాదీమా ఎక్కడ వింటుందోనని భయంగా అటూఇటూ చూసింది.

నన్ను వదిలిపెట్టి, ఆ రెండోదాన్ని కట్టుకుని, దాన్నింట్లోనే అట్టేపెట్టి మూడోదాన్ని కూడా తెచ్చుకున్నాడంట. ఇలాంటివాళ్ళను చూసే కదా మొత్తం మనమంతా ఇట్టాంటోళ్ళు అట్టాంటోళ్ళు అని కొందరు అనేది...అంటూ కడుపు చించుకుంటోంది అత్తమ్మ.

అందరూ అలా ఎందుకు చేస్తారులే అని అమ్మ అంది.

అత్తమ్మ ఊరుకుందా...అందరూ అంతేలే...అనంటుంటే మన వీధి చివర్న ఉన్న అహ్మద్‌భాయి, మన పాత ఊరులో ఉన్న కరీంజిచ్చాజీ, సలీంకాకా వీళ్లంతా అంతేనంటావా అని అమ్మ వాదనలోకి దిగింది.

వాళ్ళ పొట్ట వాళ్ళే పోషించుకోలేకపోతుంటే ఇంకోదాన్ని ఎక్కడ కట్టుకుంటారు చెప్పు అని మా బాగా సమాధానం ఇచ్చింది అత్తమ్మ.

అందుకే భాభీ... ఏ రోజు బతుకులు ఆరోజు బతికే చాలామంది మన ఆచారం అంటూ ఒక్కొక్కరూ మూడేసి నాలుగేసి నిఖాలు చేసుకుంటారనుకోవడం నిజంకాదనేది అని అమ్మే అంది.

మరి మా నాన్న అని నేను అనగానే...

మా అత్తమ్మ, మా తమ్ముడికేంటే బంగారం... వాడిలాగా అందరూ ఉంటారా అనడంతో మా అమ్మీజాన్ ముసిముసిగా నవ్వుకుంది.

ఎందుకనమ్మా నాన్నలాగా అందరూ ఆలోచించరేం అనడిగా...

కాలం మార్చుతుందమ్మా... మారే కాలంతో పాటు మారే వాళ్లలో మీ అబ్బాజాన్ ఉన్నాడు. మీ అబ్బాజాన్‌లా ఇంకొందరు ఉండేవుంటారు. రేపు ఇంకొందరు, ఆ తరువాత ఎందరో అలా మారతారమ్మా...అనంది.

బహుశా ఆ మార్పేనేమో...తలాక్ అని అనగానే విడాకులయిపోడానికి వీల్లేదని ఇప్పుడంటున్నారంటే మార్పేకదా...

కానీ నిన్న మొన్నటి వార్తల్లో తలాక్ విషయంలో మనలో మనవాళ్ళే మాటామాటా అనుకుని మన దోస్తానా కి తలాక్ అనంటున్నారంట? ఇలా ఎందుకని అమ్మీజాన్...నాకైతే సమజ్ అవ్వటం లేదు అన్నాను.

ఇంక చాల్లే నీ లా పాయింట్లు... పెద్ద లాయరు తయారయ్యింది ఇంట్లో... అని అబ్బాజాన్ అన్నారు. ఎప్పట్నించి మా సంభాషణ వింటున్నారో...

అబ్బాజాన్ అలా అనడం గుస్సాతో కాదని...తన కూతురు లాయరంత తెలివిగలదని మురిసిపోతూ అనుంటారు అని నేనూ మురుసుకున్నానుకోండి.

మేరా ప్యారా అబ్బాజాన్.. అందరూ మా అబ్బాజాన్‌లాగా ఉంటే ఎంత బాగుండు! ❋

"సింగిల్ బల్బ్ - డబుల్ షాక్"

రుక్మిణి

రాజన్న సర్దార్ ముసలివాడైనా మహా బందోబస్తుగా మీసాలను చెడబడ తిప్పుతాడు. గపుడెపుడో మిలిట్రీలో పనిచేసినానని, ఇప్పటికీ అదే మిలిట్రీ యూనిఫారం నిద్దట్లో కూడా తగిలించుకుని పండుకుంటాడు. మనిషైతే పులిలా గాండ్రించుడు ఎవుడో అలవాటు చేసుకున్నాడాయె! మాటకు ముందు ఆ మీసాలు తిప్పుడు సరేసరి! పెండ్లాం పిల్లలు... వెనకా ముందూ ఎవరూ లేరు! అయితే పాతబడి మురికిపట్టిన ముసలి తుపాకీ మాత్రం మొండిగోడకు తగిలించి దాన్ని చూసుకుంటూ తొడలు లపలప చరుచుకుంటాడు! "సవాల్, సవాల్" అని గాండ్రింపోటి? పనీ పాటలేదుకదా... ఏదో పదీపరకా వచ్చే ఫించనుతో కాలంగడుపుతాడు. కానీ, మనిషిని మందలిస్తే మాత్రం తన గతకాలపు వైభవాన్ని కథలు కథలుగా చెప్తడు. గందుకని పనిపాటాలేని పోరగాండ్లు ఆ చింతచెట్టు కింది చేరి, అక్కడి బండరాయి మీద పీఠంవేసిన రాజన్న సర్దార్ చెప్పే గత అనుభవాలను వింటూ వినోదం పొందుతారు! అయితే గందుట్లో నమ్మలేని నిజాలు చాలా మటుకున్నా వింటానికి సంబరంగా వుంటాయి కాబట్టి... పొద్దు ఎట్లాగు పోవాలి కాబట్టి వినుకుంటారు. రాజన్న సర్దార్ బారు చుట్ట వెలిగించి తన ముచ్చట మొదలు పెడతాడు!

"ఒరె జక్కులోడా... గా తుపాకి చూసినవ్ గదర.. గదీ జర్మన్...జర్మనీల తయారయిందిరా..." అని జబ్బలు చరుచుకుంటాడు.

"కాని తాతా... మరిగది అస్సలు మోగదు గద!" జక్కులోడు అమాయకం నటించుకుంట అడుగుతడు. రాజన్న సర్దార్ పులిలా గాండ్రించుతడు.

"ఒరేయ్.. గీ మద్యేన ఎ.కె.47అనీ, 57 అనీ లపలప ఒక్కసారే వందల గుండ్లు మోతమోగిచ్చే తుపాకులొచ్చినయ్ గద..." అని భీకరంగా అడుగుతడు.

"అవును తాతా... అబ్బో మరఫిరంగులు... బోఫర్స్‌గన్‌లు... కంపూటర్లు"

"చుప్! దమాక్ తక్వగాడిద! గిందులో మరి ఒక్క గుండుతో ఒకరి జీవమే సస్తదిగద... మనిషైనా ఒక్క గుండుకు ఒక్కడే! గంతేనా?"

"గంతే తాతా గంతే?" జక్కులోడు నోరు మూసుకుంటడు. రాజన్న సర్దారు లేచి మురికిపట్టిన ముసలి తుపాకీని ఒకసారి ముద్దుపెట్టుకొని మళ్ళీ బండమీద కూలబడతడు.

"ఒరే... ఈ గన్ను అలాంటి ఇలాంటిది కాదు. సరె... జర ఇనుకో.. దీన్లోని ఒక్క గుండుతో రెండు జీవాల్ని ఒక్కసారె సంపి పారేయొచ్చు...తెల్సా!"

"ఆఁ" జక్కులోడు నోరెళ్ళబెట్టి బహుఆశ్చర్యాన్ని నటిస్తాడు.

"ఆఁ... ఆఁ... గంతేమరి! ఒకసారయితే రెండు పెద్ద పులులు... టైగర్స్... అబ్బో పదడుగుల పొడువ్వి... గవ్వి పెండ్లాం మొగుళ్ళు కావచ్చు! దోస్తులు గావచ్చు! గవి రెండు అక్కడ సరసాలాడుకుంటు సిన్మా ముచ్చట్లు చెప్పుకుంటున్నాయి. నేనైతే రెండు కుందేళ్ళనైనా కొడదామని గట్ల అడవిలకు పోతన్నా... పోతన్నగద... దూరం నుండి వాట్ని సూడంగనె నాకు నిజంగనె భయం వేసి వణికిపోతిని. ఒరే.. హమ్ మిలిట్రీల జవాన్ హైనా! క్యా కర్నా? నా జర్మనీ గన్‌లో ఒకే ఒక్క గుండుందాయె? ఎట్లా... గటు చూస్తే రెండు టైగర్స్! బాప్‌రే... డేంజర్! పెద్దపులులా సిన్మాముచ్చట్లలో వున్నె! ఇంగ జూసిన... ఇంగలాభం లేదనుకుని సూటిబారు పెట్టిన... పొదసాటుకు పోయి... నూటిగ..'ఢా'



మ్మనిపిచ్చిన...గంతే! ఖతం! ఒక్క గుండుకు రెండుపులులు సఫా...సఫా...ఖతం!"

రాజన్న సర్దార్ భీకరంగా నవ్వడంతో జడుసుకుని జక్కులోడు రాతిచప్టా మీద నుండి జారిపడి, నిమ్మళంగ లేచి పిర్రలకంటుకున్న దుమ్ముదులుపుకుని నీరసంగా మూలిగి "అరె...గట్లెట్ల జరుగుద్దే తాతా... ఒక్క గుండుకు రెండు పెద్ద పులులు... వామ్మో! నేను నమ్మనుగాక నమ్మను. ఒక్క గుండుకు ఒక్క జీవం సస్తదిగాని రెండెట్ల సస్తయి... ఆహా... నమ్మను..." అని అమాయకంగా అన్నడు.

దాంతో రాజన్న సర్దార్ రెచ్చిపోయి జక్కులోడ్ని ఎడం కాలుతోని ఒక్క లాతు ఇచ్చిండు. మళ్ళీ జక్కులోడు దభీల్మని రాతి చప్టామీద నుండి 'హా' అని డామ్మని కిందపడి... మూలక్కుంట మళ్ళీ చప్టామీద కూలబడ్డడు. రాజన్న సర్దార్ మళ్ళీ పులిలా ఘీంకరించడంతో జక్కులోడు మళ్ళీ దడుచుకున్నడు.

"అరె.. నీకు నమ్మకం కలగడం లేదు కదూ! సూడు గదుగో ఆ జర్మన్ గన్! సరె.. పదరా... పా..పా..గా రెండు పెద్దపులులు సిన్మాముచ్చట్లు చెప్పుకున్న గా చెట్టుందిగద! పా... గా చెట్టును చూపిస్తే గపుడైనా గీ గన్ను దెబ్బ ఎట్లుంటదో తెలుస్తది. హహ్హాహ్హా.. (జక్కులోడు దడుచుకుని, ఈసారి రాతిచప్టా మీద నుండి కిందకు జారిపడకుండా జాగ్రత్తపడ్డాడు) గదిరా సాక్షికం...గా చెట్టునుగానీ చూస్తే గీ జర్మనీ గన్నుదెబ్బ ఏందో నీకు తెలిసొస్తది...హహ్హాహ్హా.."

అట్లా రాజన్న సర్దార్ వినోదమైన, విచిత్రమైన కబుర్లు చెప్తడు. పులుల సంగతీ... గుండు దెబ్బ సంగతేందో గానీ... గా చెట్టు సాక్షికం మాత్రం వింటానికి మహారంజుగా వుంటుంది!

"ఏందె యాద్గిరన్నా... ఒక్క గుండుకు రెండు జీవరాసులేందే? మరి గీ చెట్టు సాక్షికం ఏందే? గా ముసలోడికి పిచ్చిగాని లేసినాదె?" జక్కులోడు యాద్గిరిని అడిగిండు.

"అరె.. ముసలి రాజన్న సర్దార్ చెప్పింది చాలా నిబద్ది విషయం! ఎందుకంటే మన ఎలక్షన్లకు ముందు మన ముఖ్యమంత్రి సారు సింగిల్ బల్బుకు అస్సలు బిల్లు డబ్బులు వసూలు చేసేది లేదని సభల్ల, పాదయాత్రల్ల చెప్పిండు. గట్లనే రైతులకు కరంటుబిల్లు మాఫీలు... ఉత్తపుణ్యానికీ కరంటు సప్లయిలు చేస్తానని నమ్మబలికిండు. మరి గిపుడేమయింది? ఒక పది, ఇరవై యూనిట్లు కాల్చుకున్న సింగిల్ బల్బు జనాలకు 'చార్జిల' పదిరూపాయలు తగ్గిస్తనంటడు. మరి రైతులకేమో, అక్రమ కనక్షన్లున్న వారికి అస్సలు 'ఉచితం' లేదంటడు! ఓ అయిదారు లక్షల అక్రమ కనక్షన్లున్నయంటడు! వాడు రైతేగద? ఉచితంగా ఇచ్చేటపుడు ఇంగ మీటర్లెందుకు? అక్రమకనెక్షన్ల సంగతెందుకు? ఏమన్న అంటే గట్ల గా చెట్టు సాక్షికంగ ఎలక్షన్లు చూపిస్తడు. గిదంతే గోల్‌మాల్ ప్రపంచకం. ఒక్క దెబ్బకు రెండు పులులు. రాజన్న సర్దార్ చెప్పే సంగతులు నమ్మబుద్ధయితదిరా!" అని బీడి దమ్ము మరో పీకుపీకి విసిరి పారేశాడు.

మళ్ళీ దబ్బుమని జక్కులోడు చప్టామీద నుండి విరుచుకుపడ్డాడు.

❃

ప్రతి మనిషిలోనూ బి.పి. ప్రెషరు సామాన్యంగా 120/80mm of Hg ఉంటుంది. అట్లానే కంటిలోని ప్రెషర్ కూడా 10 నుండి 20mm of Hg వరకు ఉంటుంది. ఇంతకంటే ప్రెషర్ మించి ఉన్నప్పుడు గ్లకోమా (నీటికాసులు) అంటారు.

నీటికాసులు

- డాక్టర్ కె.కె.ఎస్. చక్రవర్తి

గ్లకోమాలో ఆప్టిక్ డిస్క్ అనే కంటి నరం దెబ్బ తింటుంది (గ్లకోమేటస్ ఆప్టిక్ ఎట్రోఫి). దాని వల్ల అంధత్వం వస్తుంది. కంటిలోని ప్రెషర్ పెరిగేందుకు ముఖ్యమైన కారణం ఏంగిల్ ఆఫ్ ది యాంటీరియర్ ఛాంబర్‌లోని ట్రబెక్యులర్ మేస్ వర్క్‌లో కంటిలోని ద్రవం ఇరుకుగా



ప్రవహించుటచే కంటి ప్రెషర్ క్రమేపీ పెరుగుతుంది. కంటిలో ఈ మార్పులు రావడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. గ్లకోమాను కలిగించే జీన్స్ కూడా శరీరంలో ఉన్నాయని ఈ మధ్య పరిశోధనల వలన తెలుస్తున్నది.

నీటికాసుల గురించి చాలా పరిశోధన జరుగుతున్నది. ఈ జబ్బు అవగాహనలో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రస్తుతం నీటికాసులు అనేది కంటినరంలో జరిగే మార్పులవలన, నెర్వ్‌ఫైబర్ లేయర్‌లో మార్పుల వలన, ఫీల్డ్ ఛేంజెస్‌లో మార్పుల వలన గ్లకోమా వస్తోందన్నది ప్రస్తుత అవగాహన. ఆప్టిక్ నెర్వ్ ఛేంజెస్, ఫీల్డ్ ఛేంజెస్ వల్ల పీడనశక్తి పెరగవచ్చు లేక పీడనశక్తి నార్మల్‌గా ఉండవచ్చు.

నడి వయస్సులో వచ్చే గ్లకోమా అనే కంటి వ్యాధి తెలియకుండా ముదిరిపోయి శాశ్వత అంధత్వానికి దారి తీస్తుంది. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి అంధత్వానికి గురి కావడంతో ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. నీటికాసులు విషయంలో ముందు జాగ్రత్త పడినచో శాశ్వత అంధత్వం కలుగకుండా చూపును రక్షించుకోవచ్చు. సాధారణంగా ఏదైనా వ్యాధి వచ్చినప్పుడు నొప్పి ఉంటుంది. అందుచేత రోగి వ్యాధి ముదరక ముందే చికిత్సపొంది జబ్బును నివారించుకుంటాడు. కాని గ్లకోమాలో నొప్పిలేకపోవుటచే రోగి వ్యాధిని తెలుసుకోలేడు. అందుచేత గ్లకోమా ముదిరి అంధత్వాన్ని కలుగ చేస్తుంది. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒకసారి నేత్ర పరీక్షలు చేయించుకొని ప్రారంభదశలోనే జబ్బును కనుగొనడం వల్ల నివారించవచ్చును.

నీటి కాసులలో కంటిలోని ప్రెషర్ ఎక్కువగా ఉన్నప్పుడు కంటినరం దెబ్బ తిన్నట్లుగానే, కంటిలో ప్రెషర్ తక్కువ ఉన్నా కూడా కంటిలోని నరం దెబ్బతినవచ్చును. దీనిని నార్మల్ టెన్షన్ లేక లోటెన్షన్ గ్లకోమా అంటారు. దీనిలో ప్రెషర్ నార్మల్‌గానూ, అంతకన్నా తక్కువగానూ ఉంటుంది. కాని ఆప్టిక్ డిస్క్ కప్పింగ్, నెర్వ్‌ఫైబర్ లేయర్‌లో మార్పులు, దృష్టి పథంలో మార్పులు, నీటికాసులలో మాదిరిగానే దీనిలో కూడా ఉంటుంది. ఇది ఎక్కువగా స్త్రీలలో ఉంటుంది. వీరిలో ఎక్కువగా రక్తనాళంలో జబ్బులు ఉండవచ్చును.

నీటికాసులు వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వయస్సులలోను రావచ్చును. పసిపిల్లల్లో వచ్చే నీటికాసులను కంజినిటల్ గ్లకోమా అంటారు. ఆపై చిన్నపిల్లలలో వచ్చే నీటికాసులను ఇన్‌ఫంటైల్ గ్లకోమా అంటారు. యుక్త వయస్సులో వచ్చే నీటికాసులను జువనైల్ గ్లకోమా అంటారు. నడివయస్సు దాటివచ్చే నీటికాసులను ప్రైమరీ ఓపెన్ ఏంగిల్ గ్లకోమా అంటారు. వీటి అన్నిటిలోకి ఎక్కువగా వచ్చే గ్లకోమా పెద్దవారిలో 10 శాతం వరకూ రావచ్చును. స్త్రీ పురుషులలో సమానంగా ఉంటుంది. ఆఫ్రికన్ జాతిలో నీటికాసులు ఎక్కువ.

గ్లకోమాను కనుగొనే ఆధునిక పద్ధతులు

విస్వల్ ఎక్యుటీ
టోనోమెట్రీ
ఫండస్ ఎగ్జామినేషన్
గోనియోస్కోపి
ఆప్టిక్ డిస్క్ ఎక్సామినేషన్
ఆల్ట్రాసౌండ్ బైమైక్రోస్కోపీ
నెర్వ్‌ఫైబర్‌లేయర్ ఎక్సామినేషన్
విశ్వల్ ఫీల్డ్ ఎనాలిసెస్

టోనోమెట్రీ పరీక్ష ద్వారా కంటిలోని ప్రెషర్‌ను కొలవవచ్చును. దీనితో ప్రెషర్‌లోని మార్పులను కూడా కొలవవచ్చును. దీనిలో ఆప్లనేషన్ టోనోమెట్రీ అనే పరీక్ష చాలా ముఖ్యమైనది. ప్రెషర్‌లోని ఎర్రర్స్‌ను అన్నిటినీ తగ్గించి అసలైన ప్రెషర్ ఈ పద్ధతి ద్వారా తెలుసుకోవచ్చును.

కంటిలోని ప్రెషర్ పెరిగినప్పుడు కంటిలోని భాగాలన్నీ దెబ్బతింటాయి. ఆప్టిక్‌నెర్వ్ భాగం ముఖ్యమైనది. దీనిలో గాంగ్లియన్ కణాలు, వాటి ఏక్సాన్స్, కంటి నరాలు దెబ్బతిని ఆప్టిక్‌నెర్వ్ ఎండిపోతుంది. కంటి నరంలోని మార్పులు, దృష్టి పరిధిలోని మార్పులు, నెర్వ్‌ఫైబర్‌లేయర్‌లోని మార్పులు అన్నియు కంటినరానికి రక్త సరఫరా తగ్గడం వల్ల



కలుగుతున్నాయి. నెర్వ్‌ఫైబర్‌లేయర్ స్టడీస్ వల్ల గ్లకోమాను అనేక సంవత్సరాల ముందుగానే గుర్తించవచ్చును.

దృష్టి పరిధి పరీక్షలలో ఆటోమేటిడ్ ఫెరిమేట్రి చాలా ముఖ్యమైనవి. దీనివలన గ్లకోమా జబ్బును నిర్ధారించవచ్చును. అంతేకాకుండా వరుసగా ఈ పరీక్షలు చేసి నీటికాసులు జబ్బు అదే దశలో ఉన్నదా లేక ముదిరిందా అనేది తెలుసుకో వచ్చును.

నీటికాసులకు పర్యవేక్షణ:

నీటికాసుల రోగులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దృష్టిపరిధి పరీక్షలు చేయించాలి. నీటికాసుల జబ్బు పర్యవేక్షణ అనేది జబ్బు ఉధృతని బట్టి, టార్గెట్ ప్రెషర్ బట్టి, ఫీల్డ్‌లాస్‌ను బట్టి నిర్ధారించాలి.

నీటికాసులు - చికిత్స

నీటికాసులు వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత చికిత్స మొదలు పెట్టాలి. చికిత్స సాధారణంగా జీవితాంతం ఉంటుంది. సంవత్సరానికి 3,4 సార్లు ఆప్టిక్ డిస్క్, నెర్వ్‌ఫైబర్ లేయర్, పెరిఫెరల్ ఫీల్డ్స్, కంటి ప్రెషర్‌లు తనిఖీ చేయాలి. లేజర్ ఫొటోగ్రఫీ ఆఫ్ ఆప్టిక్ డిస్క్, పోలారీమెట్రి ఆఫ్ నెర్వ్‌ఫైబర్ లేయర్ అనే పరీక్షల ద్వారా నీటికాసులు జబ్బు ఎంతవరకు పెరిగిందో గుర్తించవచ్చును. గ్లకోమాకు సాధారణంగా మందులతోను, లేజర్ ట్రీట్‌మెంటుతోను, ఆపరేషన్ ద్వారా చికిత్స చేయాలి. అందరికీ ఒకే రకమైన చికిత్స పనికి రాదు. చికిత్సలో ముఖ్య ఉద్దేశం చూపును కాపాడటం, చికిత్స వలన సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉంచడం, క్వాలిటీ ఆఫ్ లైఫ్‌ను ఇంప్రూవ్ చేయడం.

మెడికల్ ట్రీట్‌మెంట్

ఫస్ట్‌లైనాప్‌ల ట్రీట్‌మెంటు సాధారణంగా బీటాబ్లాకర్‌తో మొదలు పెడతాము. అప్రక్లోనైడిన్, బ్రొమోనైడిన్, టార్‌ట్రాటే, బిమోటోప్రోస్ట్, లాటనోప్రోస్ట్ డోర్జోల్‌మైడ్ ఇంకా ఇతరాలైన ఆధునిక కంటి మందులు నీటికాసుకు వాడతారు. ఒక రకం మందు పనిచేయకపోతే ఇంకొకటి వాడాలి. ఒక్కోసారి ఒకటి లేక రెండు రకాల చుక్కల మందులు వాడాల్సి ఉంటుంది. ఒక్కొక్కసారి నోటి ద్వారా, ఐ.వి. ద్వారా మందులు వాడాల్సి ఉంటుంది. రెండు రకాల మందులు వాడినా గ్లకోమా తగ్గకపోతే సర్జరీ చేయాల్సిన అవసరం ఉంటుంది.

లేజర్ ట్రీట్‌మెంట్

లేజర్ ట్రీట్‌మెంట్‌లో దీర్ఘకాలిక ఫలితాలు అంత సరిగా ఉండవు. అందుచేత ఈ పద్ధతి అందరికీ అనుకూలంగా ఉండదు. లేజర్‌ట్రీట్‌మెంట్ అయిన తరువాత మళ్ళీ మందులు వాడాల్సి ఉంటుంది. లేజర్ ట్రీట్‌మెంట్ అయిన తరువాత ఫిల్టరింగ్ ఆపరేషన్ (ట్రబెక్యులెక్టమి) కూడా కొన్ని సార్లు చేయాల్సిన అవసరం ఉంటుంది.

సర్జికల్ ట్రీట్‌మెంట్

నీటికాసులకు ఫిల్టరింగ్ ఆపరేషన్ (ట్రబెక్యులెక్టమి) ద్వారా చికిత్స చేయవచ్చును. ఇది జీవితాంతం కంటి లోని గ్లకోమా ప్రెషర్‌ను తగ్గిస్తుంది. ట్రబెక్యులెక్టమి ఆపరేషన్‌లో కంటి ప్రెషర్‌ను తగ్గిస్తూనే దృష్టిపథంలోని మార్పులను ఆపుడానికి తోడ్పతుంది. మెడికల్ ట్రీట్‌మెంటు పని చేయనప్పుడు, లేజర్ ట్రీట్‌మెంటు పని చేయనప్పుడు, ట్రబెక్యులెక్టమి ఆపరేషన్ చేయ బడును. మూర్ ఫీల్డ్ ఐ హాస్పిటల్‌లో, గ్లాస్గో హాస్పిటల్‌లో ఒకసారి గ్లకోమా నిర్ధారణ అయితే ట్రబెక్యులెక్టమి ఆపరేషన్ మొదటిలోనే చేస్తారు. ❃



నీటికాసులు - నివారణ



❖ కొంతమంది మాటిమాటికి అద్దాలు మారుస్తూ ఉంటారు. ఏ అద్దం వాడినా తృప్తిగా ఉండదు. ఇలాంటి వారికి నీటికాసుల పరీక్షలు చేయించాలి.

❖ డయాబెటిక్ రోగులలో నీటికాసులు చాలా ఎక్కువగా వస్తాయి. డయాబెటిస్‌లోను, నీటికాసులలోను రక్తనాళంలో మార్పుల వలన నీటికాసులు రావచ్చును. అందువలన ప్రతి డయాబెటిక్ రోగి ఆరునెలలకు ఒకసారి నీటికాసుల కొరకు కంటి పరీక్షలు చేయించాలి.

❖ మయోపియా-హ్రస్వదృష్టి ఉన్నవారిలో గ్లకోమా వచ్చే అవకాశం చాలా ఎక్కువ.

❖ 40 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తీ కంటిపరీక్షలు విధిగా చేయించుకోవాలి. ముఖ్యంగా కంటిలోని పీడనశక్తి(ఐ.ఓ.పి) నార్మల్‌గా ఉన్నదా, ఎక్కువగా ఉన్నదా చూసుకోవాలి. నీటికాసుల వ్యాధి 40 సంవత్సరాల తరువాత వచ్చే అవకాశం ఉన్నది.

❖ వంశపారంపర్యంగా నీటికాసులు వ్యాధి వచ్చే అవకాశం ఉన్నది. రోగి రక్త సంబంధీకులందరికీ గ్లకోమా ఎవాల్యుయేషన్ పరీక్షలు చేయించాలి.

❖ ధూమపానం వల్ల గ్లకోమా ఎక్కువగా వస్తుంది.

❖ బి.పి. రోగులలో కూడా నీటికాసులు ఎక్కువగా వస్తుంది.

❖ స్టీరాయిడ్స్ కంటి లోగాని, ఒంటికిగాని ఎక్కువగా వాడిన వారిలో నీటికాసులు వచ్చే అవకాశం చాలా ఎక్కువ.

మెడికల్‌ట్రీట్‌మెంట్‌ఫెయిల్‌అవ్వటానికిముఖ్యమైనకారణాలు:

1.కాంప్లన్స్: అనగా రోగి డాక్టర్ వద్దకు పరీక్ష నిమిత్తం చాలా సార్లు వెళ్ళాల్సిన అవసరం ఉన్నది. తన కున్న ఇబ్బందులతో రోగి అన్ని సార్లు డాక్టర్ వద్దకు వెళ్ళక పోవడం వల్ల గ్లకోమా వ్యాధి వ్యాప్తి చెంది కంటికి ఎక్కువ నష్టం కలిగే అవకాశం ఉన్నది.

2.ఇన్‌కన్వీనియన్స్: రోగి మందులు రోజుకు ఒకసారి వేసుకొనేది అయితే ఇష్టపడతాడు. కాని ఎక్కువ మందిలో ఒకటి కన్నా ఎక్కువ మందులు వాడాల్సి ఉంటుంది. అందుచేత వైద్యంపై రోగికి ఆసక్తి ఉండదు.

3. ఖరీదైన వైద్యం: గ్లకోమా మందులన్నీ చాలా ఖరీదైనవి. వైద్యం సక్రమంగా జరగాలంటే డబ్బును బాగా ఖర్చుపెట్టాల్సి ఉన్నది.

4.సైడ్ ఎఫెక్ట్స్: నీటికాసుల మందులు చాలా కాలం వాడితే కన్జిక్టివాలో క్రానిక్ ఇన్‌ఫల్‌మేషన్, స్మాల్ పీపులు, ఐరిస్ సిస్ట్ అనే ఇబ్బందులు రావచ్చు. దీనివలన ముందు ముందు సర్జరీకి ఇబ్బందులు రావచ్చును.

పుస్తక పరిచయం

వలస కథలు

తెలంగాణా నుండి బొంబాయికి వలసపోయిన చేనేత కుటుంబానికి చెందిన అంబల్ల జనార్ధన్, స్వయంకృషితో దుర్భర జీవితాన్నీ అధిగమించి ఉన్నత శిఖరాలను అందుకున్న తీరు నేటి యువతరానికి మార్గదర్శకం. తను పుట్టిన నేలను, తనవాళ్ళను, తన భాష పట్ల అపారమైన మమకారం కల జనార్దనను ప్రవాసాంధ్రుడు అని వర్గీకరించలేము. ఎంత ఉన్నతస్థాయికెదిగినా తన మూలాలను మరచిపోలేదు. తనలోని సాహిత్య కాంక్షను, ఆర్తిని వెలిబుచ్చడానికి తెలుగుభాషనే మాధ్యమంగా చేసుకొని గణనీయంగా సాహిత్యకృషి చేస్తున్న అంబల్ల జనార్ధన్ తన రచనల ద్వారా తెలుగుసాహిత్యంలో ఒక ప్రత్యేకస్థానాన్ని నిలబెట్టుకున్నారు. వారి బొంబాయి జీవితాన్ని, బొంబాయిలోని తెలుగువాళ్ళ జీవితాలను వివరించిన "బొంబాయి కథలు" ప్రవాసాంధ్రుల బ్రతుకు పోరాటానికి అద్దం పడతాయి. మనకు తెలియని బొంబాయి నగరవర్ణన, విశేషాలను "బొంబాయి నానీలు"లో తెలియజేశారు.

ఇప్పుడు వచ్చిన అంబల్ల జనార్ధన్ కథలు ఏవో ఊహల ప్రాతిపదికపై వచ్చినవి కావు. ఈ కథల్లో ఆయన జీవితాన్ని గుర్తించవచ్చు. ఆయన జీవితాన్ని గెలుచుకున్న తీరును గమనించవచ్చు. ఈ కథల్లో ఆయన ఆశలను, ఆశయాలను, అభిరుచులను, కుటుంబ సంబంధాలను, మానవసంబంధాలను అత్యంత ఆత్మీయంగా తెలియజేసిన తీరు మనల్ని ముగ్ధులను చేస్తుంది. పేద కుటుంబాలనుండి వచ్చినవారు ఆర్థికంగా స్థిరపడిన తర్వాత తమవారికి దూరంగా మెదలాలనుకునేవారి భేషజాన్ని, నియో -రిచ్ బుద్ధులను అత్యంత సహజంగా చిత్రీకరించారు. రాను రాను కుటుంబ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న పరిస్థితులను చిన్నగా ఫోకస్ చేసి చూపించారు. మనిషి పెరుగుదల అభివృద్ధికీ, సంతోషానికి దారితీయాలి తప్ప వ్యసనపరుడిగా, అవకాశవాదిగా మారకూడదని కొన్ని కథల్లో హెచ్చరించారు. స్వయంకృషి, శ్రమశక్తి, డిగ్నిటీ ఆఫ్ లేబర్ అనే అంశాల పట్ల రచయితకున్న నమ్మకం, విశ్వాసాన్ని ఈనాటి యువతరం అంది పుచ్చుకోవాల్సిన అవసరం వుంది. శ్రమశక్తి విలువ తెలిపిన కన్నతల్లి 'వ్యసనం' కథలో మన మనసును కదిలిస్తుంది. బొంబాయికి వచ్చినవాళ్ళు కార్మికులుగా, పనివాళ్ళుగా, బీడికార్మికులుగా కష్టపడి పనిచేస్తూ తమ పిల్లలు బాగుపడాలని అభిలషించేవాళ్ళు, ఊర్లల్లో తమ కుటుంబాలను ఆదుకోవాలని తపించేవాళ్ళు, వాళ్ళ నిజాయితీని, వాళ్ళ త్యాగాన్ని కొన్ని కథలు తెలియజేస్తాయి. శ్రమదోపిడీని, ముఖ్యంగా బీడి కార్మికులపై సాగే దోపిడీకి తెలంగాణా అయినా, బొంబాయి అయినా పెద్ద తేడా లేదని నిరూపిస్తాయి. బతుకు తెరువుకై బొంబాయికి లేదా గల్ఫ్‌దేశాలకు వలసపోయి కుటుంబాన్ని ఆదుకోవాలని, చివరకు తమ ఊర్లో స్థిరపడాలని ఇంటికి డబ్బు పంపిస్తే, దాని విలువ తెలుసుకోకుండా దుర్వినియోగం చేసి, వారికి క్షోభను మిగిల్చే కుటుంబాల కథలను గురించి కూడా వివరించారు. వలసవచ్చిన కుటుంబాలలో గత తరానికి, ఈ తరానికి మధ్య ఏర్పడిన అంతరాలను, వాళ్ళ ఆలోచనా విధానాన్ని కూడా ఆసక్తికరంగా తెలియజేశారు. కుటుంబ సంబంధాలను, మానవ సంబంధాలను వివరించే కథలలో రచయిత భావుకతను, ఆదర్శవాదాన్ని, నిజాయితీని, ఆశావాహ దృక్పథాన్ని మనం స్పష్టంగా గుర్తించవచ్చు.

రచయిత బ్యాంక్ ఆఫీసర్ కాబట్టి ప్రైవేట్ ఆర్థిక సంస్థలు చేసే మోసాలను, దోపిడీని వివరిస్తూ పాఠకుల్ని అప్రమత్తం చేస్తారు. ప్రభుత్వ సంస్థల్లో, కార్యాలయాల్లో చోటు చేసుకున్న బ్యూరోక్రసీ - రెడ్‌టేపిజం రచయిత దృష్టిని దాటి పోలేదు. గ్లోబలైజేషన్, బహుళజాతి సంస్థలు వాటి వ్యాపారధోరణిని, వ్యాపార విస్తరణను అద్భుతంగా చిత్రించిన కథలు "ఇంటర్నేషనల్ ఫ్రాంచైసీ", "భూతలస్వర్గం" కథలు.

ఇలాంటి సీరియస్ కథలే కాకుండా మంచి వ్యంగ్యంతో రాసిన కథలుకూడా కొన్ని ఇందులో చోటు చేసుకోవడం విశేషమే. మాకు తెలుగురాదని గర్వంగా చెప్పుకునే ప్రబుద్ధులకు "శ్రీకారం" కథ ఒక చురకలా తగులుతుంది. సబర్బన్ రైలు ప్రయాణం రచయిత సునిశిత దృష్టికి తార్కాణం. కొంతమంది వ్యక్తుల భేషజాన్ని, అహంకారాన్ని దెబ్బతీయడానికి వ్యంగ్యాన్ని కూడా ఒక సాధనంగా మల్చుకోవడాన్ని కొన్ని కథలలో గమనించవచ్చు. చిన్న కథ అయినా, పెద్దకథ అయినా ఎక్కడా బిగి సడలకుండా సమాచారాత్మకంగా, ఆలోచనాత్మకంగా కథలను తీర్చి దిద్దిన తీరు ప్రశంసనీయం. అంబల్ల జనార్ధన జీవితానుభవాల నుండి వెలువడిన ఈ కథలు ఉత్తర తెలంగాణా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవితానికి దర్పణంగా నిలుస్తాయి.

- కె.పి. అశోక్‌కుమార్

అంబల్ల జనార్దన్‌కథలు
'శ్రీ' నివాసం, బి-204, ధీరజ్ కిరణ్
మలాడ్ (వెస్ట్), ముంబాయి
వెల: 75/- పేజీలు: 194
ప్రతులకు: విశాల సాహిత్యఅకాడమి
బాగ్ అంబర్‌పేట
హైదరాబాద్

శ్రీకారం



వాడని పూలు
కోపూరి పుష్పాదేవి
వెల : 25/-
ప్రతులకు : కోపూరి రామచంద్రరావు
టైలర్‌పేట, కొత్తపేట,
విజయవాడ-1

దళిత ప్రస్థానం
రచయిత: జె. శ్రీ రఘుపతిరావు
వెల : 40/-
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్
ఆర్య సమాజ్ మందిర్‌ఎదుట, సుల్తాన్‌బజార్
కాచిగూడ, హైదరాబాద్



రంగుల చినుకులు
రచన: యిమ్మిడిశెట్టి చక్రపాణి
వెల : 25/-
ప్రతులకు : ఇ. చక్రపాణి
శ్రీకన్య అపార్ట్‌మెంట్స్, నెహ్రూచౌక్
అనకాపల్లి 531 001.

పర్వత విడుదుల రాణి ముస్సోరీ

ముస్సోరీ పేరు వినగానే మేఘాల నడుమ నెలకొన్న సుందర పట్టణం మన కళ్ళెదుట నిలుస్తుంది. ఈ పట్టణం హిమాలయాలలోని ఘర్వాల్ కొండల్లో ఉంది. దీనిని పర్వత విడుదుల రాణిగా అభివర్ణించ వచ్చు. ఈ పట్టణం మేఘాల నడుమ నిర్మితమయిందా అన్న భావన మనకు కలుగుతుంది. అందుకే దీనిని మేఘాల నగరం అంటారు.

సరోజిని

దీని సహజ అందాలకు ముగ్ధుడైన బ్రిటీష్ సైనికాధికారి కెప్టెన్ యంగ్ 1820లో ఇక్కడ నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచే ముస్సోరీ వేసవి విడిదిగా పేరు గాంచింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో 'ముస్సోరీ' మొక్కలు ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది.

ఈ సుందర నగరం హిమాలయాలలోని పచ్చని అడవుల్లో 2,500 మీటర్ల ఎత్తున ఉన్నది. దీని ఉనికి, అందాలను దృష్టిలో పెట్టుకుంటే ఉత్తర ప్రాంతంలోని అత్యుత్తమ పర్వత విడిదిగా దీనిని చెప్పుకోవచ్చు. వేసవి తాపం నుంచి విముక్తి పొందాలనుకొనే పర్యాటకుల కు ఇది చక్కటి ఆవాసంగా ఉంటుంది. అద్భుత అందాలను ప్రకృతి మాత ముస్సోరీకి బహుమతిగా ఇచ్చింది. వేసవి కాలం ప్రారంభంతోనే ఇక్కడికి పర్యాటకుల రాక మొదలవుతుంది. ముస్సోరీ దేశ రాజధాని ఢిల్లీకి చాలా దగ్గరగా ఉండటం వల్ల అక్కడకు వచ్చిన పర్యాటకులు ఇక్కడకు కూడా తప్పకుండా వస్తారు. రాత్రికి బయలు దేరితే ఉదయానికి ముస్సోరీకి చేసుకోవచ్చు. పగలంతా అక్కడి అందాలను ఆస్వాదించి తిరిగి రాత్రికి బయలుదేరి మరునటి రోజుకు ఢిల్లీకి వెళ్ళవచ్చును. అయితే కొంత విశ్రాంతిగా ఈ ప్రాంతాన్ని చూడాలనుకొనే వారికి దీనితో పాటు చుట్టు పక్కల ఉన్న కేదారనాథ్, బదరీనాథ్, గంగోత్రి, యమునోత్రి, హరిద్వార్, రిషీకేష్ వంటి అనేక ప్రదేశాలు కూడా సంతోషాన్ని అందిస్తాయి.

పర్యాటకులు వేసవిలోనే గాక కొద్దిగా మంచు కురుస్తున్న సమయంలో కూడా వస్తారు. రాత్రి కురిసిన మంచులో నగరం తెల్లటి దుప్పటి పరచినట్లు ఎంతో నయన మనోహరంగా దర్శనమిస్తుంది. టిబెట్ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా ఇక్కడ టిబెట్ ఆలయం మనల్ని ఆహ్వానిస్తుంది. లేక్ మిస్ట్, ముస్సోరీ లేక్, లాల్ టిబ్బా వంటి అనేక ప్రదేశాలు ఇక్కడ దర్శనీయ స్థలాలుగా ఉన్నాయి. ముస్సోరీలోని అత్యంత ఎత్తయిన ప్రదేశం లాల్ టిబ్బా. ఇక్కడికి రోప్‌వే మార్గంలో వెళ్ళవచ్చు. ఈ ప్రదేశం నుంచి చూస్తే ఎవరెస్టు శిఖరం కన్పిస్తుంది. ముస్సోరీలోని రెండవ ఎత్తయిన ప్రదేశం గన్‌హిల్. ఇక్కడి నుంచి చూస్తుంటే ముస్సోరీ అందాలు నిముషనిముషానికీ మారిపోతూ దర్శనమిస్తాయి.



ఇక్కడ అనేక దుకాణాలు ఉన్నాయి. ముస్సోరీలో చక్కటి చెక్క వస్తువులు దొరుకుతాయి. ఇత్తడి బొమ్మలు, సిరమిక్ ఫ్లవర్‌వేజ్‌ల వంటివి కొనేటప్పుడు బేరం చేసుకోవచ్చు. ఓక్ చెక్కతో చేసిన చేతి కర్రలకు ఈ ప్రదేశం ప్రసిద్ధి. ఘర్వాలీ డ్రెస్‌లు ధరించి ఫొటోలు దిగే సదుపాయం కూడా ఉంది. ఇక్కడ మంచి నాణ్యమైన శాలువాలు లభిస్తాయి.

ముస్సోరీకి చుట్టుపక్కల చూడదగ్గ ప్రదేశాలు అనేకం ఉన్నాయి. వాటిలో మున్సిపల్ గార్డెన్స్, కెమ్టీ జలపాతం, కేమల్స్ బ్యాక్ రోడ్, క్లవుడ్ ఎండ్, యమునోత్రి వంతెన, నాగ్ టిబ్బా, భద్రజ్ ఆలయం, సార్కుండా దేవి, ఝరీపానీ జలపాతం వంటివి.



ముస్సోరీకి వెళ్ళాలంటే ఢిల్లీ నుంచి నిరంతరం బస్‌లు తిరుగుతూ ఉంటాయి. దీనికి సమీప విమానాశ్రయం జెల్లీగ్రాంట్ విమానాశ్రయం. ఇది ముస్సోరీకి 60 కి.మీ. దూరంలో ఉంది. అయితే ఇక్కడకు తరచుగా విమానాలు అందుబాటులో లేవు. ఇక్కడికి ఎలాంటి రైలు మార్గం లేదు. డెహ్రాడూన్ రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి బస్సు లేదా ట్యాక్సీలో వెళ్ళ వచ్చును. అయితే ఉత్తర ప్రదేశ్, ఉత్తరాంచల్‌లోని ప్రధాన నగరాల నుంచి చక్కటి రోడ్డు మార్గాలున్నాయి.

ఇక్కడ అన్ని రకాల ఆదాయ వర్గాల వారికి అందు బాటులో ఉండే వసతి సౌకర్యా లున్నాయి. పెద్ద విలాసవంతమైన హోటళ్ళ నుంచి చిన్న చిన్న లాడ్జీల వరకూ ఇక్కడ ఉన్నాయి.

ఇక్కడ వాతావరణం సంవత్సర మంతా చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకూ పచ్చటి వృక్షాలతో, చల్లటి వాతావరణంతో ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఈ నగరాన్ని సందర్శించేందుకు ఏప్రిల్ నుంచి జూన్, తిరిగి సెప్టెంబర్ నుంచి నవంబర్ మంచి అనుకూలమైన సమయం. సెప్టెంబర్ నుంచి నవంబర్ మధ్య కాలంలో ఇక్కడి నుంచి చూస్తే హిమాలయాలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి. వర్షాకాలంలో ఇక్కడకు రాకపోవడమే మంచిది.

*



శాంతి స్థాపనకు కళారూపాలతో ప్రచారం



చలపాక ప్రకాష్

"శాంతియుతమైన సమాజ స్థాపన కొరకు కళలు కూడా ప్రముఖమైన స్థానం వహిస్తాయి. ప్రతిఒక్కరూ కళాహృదయం కలిగివుంటే ఆ సమాజం అన్ని రంగాలలో పురోగాభివృద్ధిలో ముందుంటుంది" అని ప్రచారం చేస్తూ 'కళామూర్తి'గా పేరొందిన ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి కళారంగానికి సుపరిచితుడు. కవిగా, రచయితగా, నటుడిగా, గాయకుడిగా, ప్రయోక్తగా, న్యాయనిర్ణేతగా, సాహితీసంస్థ నిర్వాహకుడిగా, జర్నలిస్టుగా, రేడియో ఆర్టిస్టుగా, దర్శకుడిగా ఎం.వి.ఆర్. బహుముఖ ప్రజ్ఞాశాలి.

1951 సంవత్సరంలో యజ్ఞసామిదేవమ్మ, సుబ్రహ్మణ్యం గార్లకు పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో జన్మించిన ఎం.ఆర్.వి. పూర్తి పేరు మలపాక రామవెంకట సత్యనారాయణమూర్తి. 1974 సంవత్సరంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాలు అనుకోకుండా అయన్ని కళాకారుడుగా ఎదగటానికి ఉసిగొల్పింది. తన మిత్రుల ప్రోద్బలంతో తొలిసారిగా నటుడిగా రంగస్థలంపై కాలుమోపిన ఎం.ఆర్.వి. ఈనాడు వివిధ కళారూపాలలో నిష్ణాతుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవటం విశేషం. శ్రీమంతులు, ఉప్పుసత్యాగ్రహం, జ్వాల, లేతగులాబీలు, వరుడు కావాలి, మంచం మీద మనిషి, ఓటున్న ప్రజలకు కోటి దండాలు, ప్రొఫెసర్‌గారొస్తున్నారు జాగ్రత్త, ఛీఛీ, మెసోకెస్ట్, ఇంటర్వ్యూ నాటకాలలో విభిన్న పాత్రలను పోషించి ప్రశంసలు అందుకున్న ఎం.ఆర్.వి. జ్వాల నాటికలో పురుషోత్తమరావు పాత్రకు ఉత్తమనటుడిగా బహుమతిని పొందారు. 'అన్వేషణ' రేడియో నాటికలో తాను పోషించిన పాత్రకు అఖిలభారత స్థాయిలో తృతీయ బహుమతిని అందుకున్నారు.

పెనుగొండలో డాక్టర్ కె.ఎస్.రాజు అండ్ ఎస్.వి.కె.పి. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1991లో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో మూర్తి రచించి, దర్శకత్వం వహించి, నటించిన 'సమైక్యతా భారత్' నాటిక 16 రాష్ట్రాల విద్యార్థులను, అధ్యాపకులను విశేషంగా ఆకట్టుకున్నది. జాతీయ సమైక్యతను ప్రబోధించే ఈ నాటికను ప్రదర్శించినందుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ కె.వి. శివయ్య నుండి షీల్డును ఎం.ఆర్.వి. అందుకున్నారు. పలునాటక కళాపరిషత్‌లకు, రాష్ట్రస్థాయి పాటలపోటీలకు న్యాయనిర్ణేతగా పాల్గొన్న మూర్తి మంచి గాయకుడు కూడా. అనేకసార్లు పాటల పోటీలలో బహుమతులు అందుకోవటంతో పాటు 'ఆకాశవాణి' లో పలు నాటికలు, కథానికలు, ప్రసంగాలు, పాటలు, కవితలు ప్రసారం అయ్యాయి. పలు నాటికలలోనూ నటించి రేడియో శ్రోతల ప్రశంసలూ అందుకున్నారు. ఆయన రచించిన 'వయోజన మేలుకో' గీతాన్ని ఆకాశవాణి విజయవాడ వారు 1990 నుండి 'కాంతిరేఖలు' ద్వారా ప్రసారం చేస్తుండటం విశేషం.

వీరు రాసిన 'అక్షర దీపాలు' గేయ సంపుటిని 1991లో నర్సాపురం సబ్‌కలెక్టర్ డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి, "అక్షరభారతం" నాటికను జిల్లాకలెక్టర్ అజేయకల్లం ఆవిష్కరించి, సత్కరించారు. నవ్యరాగం పత్రికవారు 1992లో నిర్వహించిన కథల పోటీలలో 'మావూరి కోరిక'కు ప్రథమ బహుమతి, రాజమండ్రి యువస్వరం వారు 1993లో నిర్వహించిన కథల పోటీలలో 'పుణ్యభూమి కళ్ళు తెరు' కు ప్రథమ బహుమతిని పొందారు.

వీరు రచించిన కథల సంపుటి 'అమ్మకోరిక' అక్కినేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. వీరు రచించిన



కథలపై స్వాతంత్ర్య సమరయోధులు బెజవాడ గోపాలరెడ్డి స్పందిస్తూ "మానవతలేని మనిషి జన్మ నిరుపయోగం. ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి కథలు మానవీయ విలువలతో నిండివుంటాయి. బడుగుజీవుల ఆవేదన, అసహాయత వీరి కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అనవసరమైన వర్ణనలకు తావులేకుండా సరళమైన భాషలో హృదయాన్ని సూటిగా తాకే మాటలతో వీరి కథలు సాగడం అభినందనీయం" అంటూ పేర్కొనటం మూర్తి ఎంచుకున్న కథాంశాల ప్రత్యేకతను చాటుతుంది.

1986లో "రమ్యసాహితీ సమితి"ని స్థాపించి ప్రతి సంవత్సరం యువ కవులను, రచయితలను ప్రోత్సహించడానికి రాష్ట్రస్థాయి కవితా, కథాపోటీలు నిర్వహిస్తూ, వాటిని సంకలనాలుగా ప్రచురిస్తున్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కుంభకోణంలో జరిగిన దుర్ఘటనలో అశువులు బాసిన చిన్నారుల స్మృత్యర్థం రాష్ట్రస్థాయిలో కవితా సంకలనం తెచ్చే ప్రయత్నం చేపట్టారు. మూడు సంవత్సరాలుగా శ్రమించి, పది సం॥లుగా వెలుగుచూడలేకపోయిన 'పశ్చిమ గోదావరి జిల్లా స్వాతంత్ర్యోద్యమ' చరిత్ర గ్రంథాన్ని రమ్య సాహితీ తరుపున ముద్రించి జిల్లావాసులకు అపూర్వకానుకగా అందించి పలువురి ప్రశంసలు, అభినందనలు అందుకున్నారు. ఇంతటి చారిత్రక గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చిన 'సాహితీ మూర్తిని' స్వాతంత్ర్య సమరయోధులు డా॥ బెజవాడ గోపాలరెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, మాజీ మంత్రి వీర వెంకట నారాయణ తదితరులచే ఏలూరులో ఘనసత్కారం అందుకున్న మూర్తి, పెనుగొండ యూత్ ఛాంబర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడిగా, భారత్-సోవియట్ మైత్రీ సాంస్కృతిక సంఘ కార్యదర్శిగా, త్యాగరాయగాన సభ అధ్యక్షులుగా, రీడర్స్ ఫోరం కార్యదర్శిగా, ఇలా పలు పదవులు నిర్వహిస్తూ, సాహిత్య కళారంగానికి చేస్తున్న అపూర్వసేవ అభినందనీయం. ✼

అదిగో...అదిగదిగో

డా॥ నాగినేని భాస్కరరావు



అవిగో తండ్రీ! అవిగో తల్లీ!!
ప్రజా సమూహాలు! ఉవ్వెత్తున ఎగిసిపడ్డ ఉద్యమ కెరటాలు!!
నాగలి పట్టిన చేతులు, కొడవలి పట్టిన మహిళలు
యంత్రం త్రిప్పిన చేతులు, మంత్రం మోసిన మగువలు
కూడివచ్చి - తరలివచ్చిన జన సముద్రాలు
అవిగో తండ్రీ! అవిగో తల్లీ!

నరజాతి చరిత్రలో నడుమ కాలంలో
ధరిత్రిలో దగాకోరుతనం ప్రవేశిస్తే
ధనమూ, పరిజనమూ ఆస్థి దాపరికం వస్తే
వస్తుసంపదను అసమాన పంపకాలు చేసి
నరుణ్ణి తోటినరుడు కాల్చుకుతినే - బూర్జువా, భూస్వామ్య
జమీందారీ, పెట్టుబడిదారీ వ్యవస్థల్ని
అవస్థలుపెట్టి - పెకిలించి వేయటానికి
నిర్మించిన కార్మికలోకపు సుసంఘటిత శక్తులు
నిర్మించిన కర్షకలోకపు ఐక్యశక్తులు
అవే తండ్రీ! అవి...అవే తల్లీ!!

జనచైనా లాంగ్‌మార్చ్... వీరవియత్నాం వీరగాథలు,
జారుచక్రవర్తిపై రష్యన్ల విజయం
భారత కమ్యూనిస్టుల వైభవాలు
నిరుటి జన చైతన్యపు శంఖారావాలు
అవే తండ్రీ! నిక్కచ్చిగా అవే తల్లీ!!

విజ్ఞాన శాస్త్రం విశ్వాంతరాలకు విస్తరిస్తుంటే
సమాజ శాస్త్రం, సామాజిక న్యాయం,
స్త్రీ, పురుషుల వ్యత్యాసాల అంతం
ఏ గోళానికి వెళ్లాయి? ఏ పాతాళానికి మళ్లాయి?
ఏ కుంభకోణంలో ఇరుక్కున్నాయి? ఏ దేశం చేతికి చిక్కాయి?
తగిన కూలికోసం, పనిగంటల పరిమితికోసం,
యాజమాన్య భాగస్వామ్యం కోసం
భూసంస్కరణల చట్టాలకోసం, బడుగువర్గాల జాగృతికోసం
చేసిన పటుతర రైతు-కూలీ పోరాటాలు,
తెలంగాణా సాయుధపోరాటాలు
కార్మికశక్తుల నిరంతర సంఘర్షణ జ్వాలలు
అవేను తండ్రీ! ఇవి అవేను తల్లీ!!

పోరాటాల్లో అసువులుబాసిన వీరులు
అరుణారుణ రక్తంతో తడిపిన వామపక్ష మార్గంలో
ఒక దొడ్డి కొమరయ్య, ఒక ఐలమ్మ, ఒక సుందరయ్య,
ఒక చంద్ర, ఒక కొండపల్లి, ఒక చారు మజుందార్, ఒక కార్యకర్త
మార్గాలు కొద్దిగా వేరైనా
విప్లవమార్గం వీడొద్దని చాటిన విప్లవజ్యోతుల వెలుగులు
దుర్మార్గపు పాలకులకు వ్యతిరేకంగా సలిపిన సమరాలు
సమసమాజ స్థాపనకై నిస్వార్థంగా ఎందరో కామ్రేడ్స్ నడిపిన సాయుధ
పోరాటాలు
ఒక వేమన, ఒక గురజాడ, ఒక శ్రీశ్రీ, ఒక సుబ్బారావు పాణిగ్రాహి,
ఒక చెఱబండరాజు
శ్రామిక రాజ్యంకోసం రాసిన గీతాలన్నీ- నడిపిన సాంస్కృతిక
పోరాటాలు
అదిగో తల్లీ! అదిగదిగో తండ్రీ!!

సోషలిస్టు ప్రపంచాన
ఒక క్యూబా, ఒక చైనా, ఒక వీరవియత్నాం దన్నుగా
వీడిపోయిన సోషలిస్టు రష్యా దేశాలు
పడుతూ లేస్తున్న ఇతరదేశాల వామపక్ష శక్తులన్నీ కలిసి
ఏకధృవ ప్రపంచనేతను, దేగమార్కు అక్రమార్కుణ్ణి
ప్రపంచీకరణ పేరుతో బడుగు దేశాల దరిద్రాన్ని అంతకంతకూ
పెంచుతున్న
నయవంచక ఆయుధ వ్యాపారిని
తనవాళ్లుకాని వాళ్లని మార్కెట్టు వస్తువుగా చేసిన ఆధిపత్య పిపాసిని
ప్రపంచబ్యాంకును తన కనుసన్నల్లో వుంచుకున్న బుష్ కాకిని
"హష్" అంటూ పొడిచి పొడిచి
"ప్రపంచ సమ సమాజ స్థాపకులారా! ఏకంకండి!
ఉద్యమిస్తే పోయేది ప్రపంచ దారిద్ర్యమే కాదు- ప్రపంచ రౌడీ
పెత్తనం కూడా" అని
రగులుతున్న ప్రపంచవిప్లవాగ్ని - ఏకత్వపు మార్గంలో
బుగులుకున్న ప్రపంచవామపక్షాలు - ఐక్యకార్యాచరణ సాధనలో
సోషలిస్టు రాజ్యం కోసం
కదలండని, కదలండని కదం త్రొక్కుతూ - ఎగిరే
ఎర్రెర్రన్నిజెండాలతో
ఇనుమడించిన ఉత్సాహాలతో
సాగాల్సిన ఎరుపుపోరుకై
శంఖం వూదండి. రణశంఖంపూరించండి.

*

జనవరి 26 నుండి జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభలకు
తరలివస్తున్న ఉద్యమకెరటాలకు ఆహ్వానం పలుకుతూ ఈ కవిత

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

భర్త ఆస్తి...కొడుకు మోసం!

నాకు ఏడుగురు సంతానం. ఒక్కడే కొడుకు. మిగిలిన వారు ఆడపిల్లలు. ఒక్కడే కొడుకని గారాబంగా పెంచాం. అతను ఒక్కడే చదువుకున్నాడు. మిగిలిన పిల్లలు నిరక్ష్యరాస్యులు. 4సం॥ క్రితం నా భర్త మతిస్థిమితం లేని స్థితిలో ఉన్నాడు. ఆ సమయంలో నా కొడుకు ఆయనను తీసుకువెళ్ళి ఆస్తి మొత్తం నా భర్త తన ఇష్టపూర్వకంగానే నా కొడుకు పేరున ఆస్థి రాస్తున్నట్లు వీలునామా రాయించి నా భర్త చేతి వేలుముద్ర వేయించుకున్నాడు. ఆ సమయంలో ఎక్కడికీ తీసుకువెళ్ళావని నిలదీయకపోవడం మా తప్పు. ఇలా చేస్తాడని ఎవరూ ఊహించలేదు. 2001 సెప్టెంబరు నెలలో ఆయన మరణించాడు. అప్పుడు కూడా ఆస్థి వివరాలు బయటపడలేదు. సరిగ్గా 2002లో ఆయన సంవత్సరీకం జరపాలనుకున్నాం. ఆ రోజు అందరూ వచ్చారు. కార్యక్రమం ముగియాగానే అందరూ వెళ్ళిన తరువాత నేను ఆస్థిలో నా పేరున కొంత బ్యాంకులో వేసి మిగిలిన దానిలో తక్కువ మొత్తం తీసి ఆడపిల్లలకు ఇవ్వమన్నాను. మిగిలినదంతా తననే తీసుకోమన్నాను. కానీ అతను ఎదురుతిరిగాడు. ఇంట్లో వారందరూ అంటే కోడలు, మనుమరాళ్ళుతో సహా నా కొడుకు కూడా కొట్టి రోడ్డు మీద పడేశాడు. ఈ విషయం తెలిసిన నా కూతుళ్ళు వచ్చి తీసుకువెళ్ళి వైద్యం చేయించారు. డాక్టరుగారు తొంటి విరిగిందని ఆపరేషన్ చేయాలని అన్నారు. నేను నా కూతుళ్ళను మధ్య తరగతి కుటుంబంలో ఇచ్చాను. అయినను వారు ఎలాగొలా ఎంతో కష్టపడి నాకు ఆపరేషన్ చేయించారు. నా కొడుకు ఇంత కర్కశంగా ప్రవర్తిస్తాడని ఊహించలేదు. నా కూతుళ్ళు నా కొడుకు మీద కేసు పెట్టారు. గుంటూరులో క్రిమినల్ కేసులో అతడికి 500 జరిమానా, ఆరునెలల జైలు విధిస్తూ తీర్పు ఇచ్చారు. కానీ అతను హైకోర్టుకు అప్పీలు చేసుకున్నాడు. కోర్టులో ఉన్న ఆస్థిని కూడా అమ్ముతున్నాడు.

దయచేసి మార్గం చూపండి, నాకు, నా ఆరుగురు ఆడపిల్లలకు ఆస్థి వచ్చే అవకాశం వుందా;? దొంగ వీలునామాకు కూడా విలువ ఉందా? హైకోర్టులో గెలుస్తామా? సివిల్‌కేసు కూడాపెట్టాం. అసలే నా కూతుళ్ళు పేదవాళ్ళు, వాళ్ళ దగ్గర ప్రస్తుతం నేను ఉంటున్నాను. ఎంతకాలం అక్కడ వుండను? దయచేసి నా సమస్యకు పరిష్కారం చూపగలరు.

- కోటిపల్లి సీతారావమ్మ పెదకాకాని, గుంటూరు జిల్లా.

మీరు ఈపాటికే సివిల్ కేసు వేశామంటున్నారు. ఆ కేసులో అతను ఆస్థిని అమ్మకుండా, అన్యాక్రాంతం కాకుండా మీరు స్టే తీసుకోవాలి. మీ వారు మతి స్థిమితం లేనివారని చెబుతున్నారు. అలా మెడికల్‌గా ఏమైనా ఆధారాలు ఉంటే ఆ సివిల్ కేసులో బలం ఉంటుంది. మీ వారు ఎప్పుడూ సంతకం చేసేవారే అయితే, ఆరోగ్యం బాగుండికూడా వేలుముద్ర వేశాడంటున్నారు కాబట్టి అది పరిశీలినలోకి తీసుకుంటారు.

విల్లులో మీ పేరు లేకుండా రాశారా? తన ఆరోగ్యం బాగా ఉండి రాస్తున్నాను అని క్లాజు ఉందా? ఏదేమైనా ఆ విషయాల పూర్వాపరాలు ఆ కేసులో తెలియగలవు. ఏదేమైనా మీరు ప్రస్తుతం జీవన భృతికి గాను మీ కుమారుడిపై మెయింటెన్స్ వేసి నెలకు కొంతమొత్తం పొందవచ్చు.

హైకోర్టుకి వేయవచ్చా?

గత నా కేసులో డిపెండెంటు ప్లీడరు వారి కేసు వదలుకొని సుమారు సంవత్సరమైనది. ఆ కేసు మనమే గెలుస్తామని మా ప్లీడరు గారు మన కేసు ఎక్స్‌పార్టీయై మనమే గెలుస్తామన్నారు. వాళ్ళకు ప్లీడరు గారు వదిలేసినా మా మాండిటరు పిటీషను కొట్టివేసినారు. 30-10-04 తేదీన మాండిటరీ పిటీషను గుడివాడ మునసబు కోర్టులో కొట్టివేసినారు. నన్ను ఇక్కడ ప్లీడర్లు హైకోర్టుకు వెళ్ళాలి అంటున్నారు. కొంతమంది గుడివాడ సబ్ కోర్టులో వేసుకోవచ్చు అంటున్నారు. నాకు తగిన సలహా ఇవ్వవలసినదిగా కోరుచున్నాను.

కె.వజ్రాలు. గుడివాడ

మీరు వేసిన కేసు మున్సిఫ్ కోర్టు (జూనియర్ సివిల్ జడ్జి) అయివుంటే అక్కడే వేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అయిపోతేనే హైకోర్టుకు రావాల్సి ఉంటుంది.

తాత ఆస్థికోసం ఎవరు కేసు వేయవచ్చు

మేము ముస్లిలం. మా తాత సొంత పొలం 20 ఎకరాలు. అతనికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు గవర్నమెంటు ఉద్యోగస్తుడు. రెండవవాడు రైతు. ఉద్యోగి కనుక తన వాటా రైతుకు అమ్మినాడు. కనుక రైతుకు 20 ఎకరాలు సొంతమయినది. తరువాత రైతు స్వయంగా 35 ఎకరాలు సంపాదించినాడు. ప్రస్తుత ఆస్తి 20+35=55 ఎకరాలు. ఇతనికి ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. అందరి పెళ్ళిళ్ళూ అయినాక కుమార్తెలు పొలం అడిగితే "నన్నే కొడుకులు ఇంట్లో నుంచి తరిమినారు. మీ అన్న తమ్ముళ్ళనే అడిగి తీసుకోండి" అంటున్నాడు. వాళ్ళను అడిగితే మీకు పెళ్ళిళ్ళూ అయి ఒకరికి 20సం॥, 15సం॥ 8సం॥ అయింది. మీకు పొలం ఇవ్వం దాని ఖరీదు డబ్బు కూడ ఇవ్వం అన్నారు. కనుక మాకు న్యాయం జరగాలంటే భార్యా భర్తలం కలిసి కోర్టులో కేసు వేయ్యాలా లేక బిడ్డగా ముగ్గురులో ఎవరయినా వేయ్యవచ్చా. అందరు కలిసి వేయాలా లేక మా ముగ్గురి భర్తల్లో ఎవరయినా వెయ్యవచ్చా? ముగ్గురి భర్తలు వెయ్యాలా తెలుపాలని మనవి. పొలం ప్రకాశం జిల్లాలో ఉన్నది.

షేక్ నూర్జహాన్, నూనెపల్లె, నంద్యాల.

తండ్రీ ఆస్థిలో మగవాళ్ళతో పాటు ఆడవాళ్ళకు కూడా భాగం ఉంటుంది. మీరు భార్యా భర్తలు కలిసికాదు. మీరు మీరుగానే కేసు వేయాల్సి ఉంటుంది. ఆ ఆస్థి మొత్తం ముగ్గురు కొడుకులు, ముగ్గురు కుతూళ్ళకు గాను 6.3=9 బాగాలు అవుతాయి. ....పురుషుడికి రెండుభాగాలు స్త్రీ (కూతురికి) ఒక భాగం వస్తుంది. మీలో ఎవరైతే కావాలనుకుంటున్నారో వారు కోర్టులో వేసుకోవాలి. ముగ్గురి తరపున ఒక్కరే దావా వేయడానికి లేదు. ఆస్థిలో ఎవరైతే వాటా కావాలనుకుంటున్నారో వారు తప్పక కోర్టుకెళ్ళాలి.

వెన్న వంకాయలు

కావలసిన వస్తువులు:

లేత వంకాయలు	:	అర కిలో
ఉల్లిపాయలు	:	నాలుగు
పచ్చి మిర్చి	:	పది
వెన్న	:	50 గ్రాములు
నూనె	:	50 గ్రాములు
ఉప్పు	:	తగినంత
కారం	:	తగినంత
పసుపు	:	చిటికెడు

తయారు చేసే విధానం:

వంకాయలను శుభ్రంగా కడిగి ఉంచుకోవాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయలను బాగా సన్నగా ముక్కలు చేసుకోవాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలను పసుపు, ఉప్పు, కారం, వెన్నలో వేసి బాగా కలిపి ఉంచుకోవాలి. వంకాయలను నాలుగు చీలికలుగా బాగా చివరి వరకు తెగనివ్వకుండా కోసుకోవాలి. లోపల ఉల్లి, పచ్చిమిర్చి కలిపిన మిశ్రమాన్ని లోపలపెట్టి కదలకుండా దారం కట్టాలి. ఇలాగే అన్నీ చేయాలి. పొయ్యి మీద ప్రెషర్ పాన్‌లో నూనె పోసి బాగా కాగ నివ్వాలి. వీటన్నిటిని జాగ్రత్తగా వరుసగా నూనెలో వేసి కొంచెం కలిపి మూత పెట్టి ఒక్క విజిల్ రానిచ్చి తీసి వేయాలి. ఇది చాలా రుచిగా ఉంటుంది.

అరటికాయ పెరుగు చట్నీ

కావలసిన వస్తువులు:

అరటికాయలు	:	రెండు
పెరుగు	:	పావు లీటరు
పచ్చిమిర్చి	:	50 గ్రాములు
జీలకర్ర	:	ఒక స్పూను
తాలింపు గింజలు	:	ఒక స్పూను
నూనె	:	ఒక గరిటె
అల్లం	:	చిన్నముక్క
వెల్లుల్లి	:	ఒకటి
కరివేపాకు, కొత్తిమీర	:	తగినంత
చింతపండు	:	కొంచెం
ఉప్పు, పసుపు	:	తగినంత

తయారుచేసే విధానం:

అరటికాయల్ని నీటిలో ఉడికించి తొక్క వలిచి పక్కన పెట్టుకోవాలి. పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు, పసుపు, చింతపండు మిక్సీలో గ్రైండ్ చేయాలి. అరటికాయ గుజ్జు, పెరుగు కలిపి గ్రైండ్ చేయాలి. స్టవ్ మీద గిన్నెలో నూనె పోసి తాలింపు చేయాలి. పెరుగు చట్నీ కలిపి కొత్తిమీర, కరివేపాకు కలిపి వడ్డించాలి. అన్నంలోకి, చపాతీ, పూరీల్లోకి కూడా బాగుంటుంది.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి

సమాచారం

మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే
ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు

అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ. / డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761
మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.
Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com